జనరాజకీయం కోసం ...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 3 సంచిక - 13 పక్షపత్రిక జూలై 1-15, 2012



## కొత్త మద్యం పాలసీకి వ్యతిరేకంగా లోక్‌సత్తా, వామపక్షాల నిరసన




జూన్ 16న హైదరాబాద్‌లో జరిగిన 'ఇన్‌కాన్వర్సేషన్ విత్ ద మిస్టిక్'
కార్యక్రమంలో భాగంగా సద్గురు జగ్గీవాసుదేవ్, డా॥ జయప్రకాష్ నారాయణ్




స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 57 వ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన
సభలో ప్రసంగిస్తున్న డా॥ జయప్రకాష్ నారాయణ్



మోతీనగర్‌లో కమ్యూనిటీ హాల్ శంకుస్థాపన చేస్తున్న
ఎమ్మెల్యే డా॥ జయప్రకాష్ నారాయణ్, ఎంపి సర్వే



మోతీనగర్‌లో కాలువ పునర్ వ్యవస్థీకరణకు 293 లక్షలతో
పనులను ప్రారంభిస్తున్న ఎంపి సర్వే , డా॥ జయప్రకాష్ నారాయణ్



మోతీనగర్‌లో అభివృద్ధి కార్యక్రమాలను గూర్చి స్థానిక
ప్రజలకు వివరిస్తున్న డా॥ జయప్రకాష్ నారాయణ్



కూకట్‌పల్లి నియోజకవర్గ స్థానికులు ఎమ్మెల్యే డా॥ జయప్రకాష్ నారాయణ్
కలిసి తమ సమస్యల పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు

జన రాజకీయం కోసం...

లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక జూలై1-15, 2012

సంపుటి - 3 సంచిక - 13

## లోపలి పేజీల్లో...

స్వాహారాజ్యం అంతం కోసం సురాజ్య ఉద్యమం.......5

స్వంత ముద్రకోసం కిరణ్ సర్కారు పాట్లు.............. 8

లోక్‌సత్తా, వామపక్షాల రౌండ్‌టేబుల్ సమావేశం........ 11

ఉప ఎన్నికలు...2014 ఎన్నికలు.. ఓ చర్చ........... 13

రాష్ట్రంలో రానున్న ఒప్పంద వ్యవసాయం............ 17

విత్తనాల కోసం ముప్పతిప్పలు......................... 19

జనాభా లెక్కలు - అపోహలు......................... 21

ప్రముఖుల పరమవుతున్న సబ్సిడీ సిలిండర్లు......... 24

పాత్రికేయులు సమాజ మార్పును కాంక్షించాలి....... 25

ప్రజలే కేంద్రబిందువు కావాలి......................... 26

రైతుల్ని ఆదుకునే విధానాల్లేవు......................... 28

భాగ్యనగరానికి శాపంగా మారిన డ్రైనేజీ వ్యవస్థ...... 30

అభివృద్ధి పథంలో కూకట్‌పల్లి నియోజకవర్గం........ 32

లోక్‌సత్తా పార్టీ కార్యక్రమాలు......................... 33

సంపాదకవర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

డి.వి.వి.యస్. వర్మ
సంపాదకులు

సంపాదక వర్గం

జి. రాజారెడ్డి
బండారు రామ్మోహన్‌రావు
కొంగర గంగాధరరావు
కె.వి. కుటుంబరావు
సి.హెచ్.ఎస్. మాధవరావు

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి
డి.టి.పి : జ్యోతి తాటి
ఫొటోలు : ఎన్. సంజీవ్ కుమార్

# చట్టసభలలో స్థాయీ సంఘాలు

## సంపాదకీయం

ఎట్టకేలకు స్థాయీ సంఘాలు రాబోతున్నాయి. ఇది మన రాష్ట్ర చట్టసభల చరిత్రలో ఒక ముందడుగు. ఒక మైలురాయి 2012 జూన్ 25న ఈ చారిత్రాత్మక నిర్ణయాన్ని ఉభయసభల రూల్స్ కమిటీలు శాసనసభ స్పీకర్ నాదెండ్ల మనోహర్, శాసన మండలి చైర్మన్ డా॥చక్రపాణిల అధ్యక్షతన సమావేశమై తీసుకున్నాయి. ప్రభుత్వం, ఉభయసభలలోని రాజకీయ పార్టీలు ఈ నిర్ణయాన్ని ముక్త కంఠం తో ఆమోదించడం ఒక శుభపరిణామం.

ప్రస్తుతం చట్టసభలలో చర్చలు మృగ్యం అయ్యాయి సభల కార్యకలాపాలను స్తంభింప జెయ్యడం మీదే ప్రతిపక్షాలు కేంద్రీకరిస్తుంటే, దానికి దోహదం చేసే రీతిలో ప్రభుత్వపక్షం వ్యవహరిస్తున్నది. ఎవరు అధికారంలో వున్నా సభ జరుగుతున్న తీరు మారడం లేదు. రోజుకో గందరగోళం, పతాక శీర్షికల కోసం రగడలు, టెలివిజన్‌లో పోరాటయోధులుగా కనిపించే తాపత్రయం తప్ప సభావేదికను ప్రజాసమస్యలపై చర్చలకు వేదికగా, పరిష్కార సాధనంగా పార్టీలు భావించడం లేదు. సభాసమయం వృధాకావడం, ప్రజాధనం దుర్వినియోగం కావడంతో పాటు కనీసం బడ్జెట్‌లో పద్దులపై చర్చలు లేకుండానే పలుశాఖల డిమాండ్లు ఉరికొయ్యల నెక్కుతున్నాయి. ఇక బిల్లులపైనా, విధానపరమైన అంశాలపైనా లోతైన చర్చలు లేకుండా పోయాయి. చట్టసభల మీద ప్రజల విశ్వాసం నానాటికీ సన్నగిల్లుతున్నది. ప్రజల అధికార పీఠం వాగ్యుద్ధాల వేదికగా, చూపరులకు జుగుప్స కలిగించేదిగా మారింది.

ఈ పరిస్థితులలో శాసన సభ స్పీకర్ నాదెండ్ల మనోహర్ చట్టసభలలో స్థాయీ సంఘాల ఏర్పాటుకు ప్రత్యేక చొరవ చూపించారు. అటు ప్రభుత్వాన్ని, ఇటు రాజకీయ పార్టీలను ఒప్పించడంలో కృతకృత్యులయ్యారు. పార్లమెంటులో 1997 నుండి అమలు జరుగుతున్న స్థాయీ సంఘాల పని తీరును అధ్యాయనం చేయడంతో పాటు, కేరళ, బెంగాల్, అస్సాం, తదితర రాష్ట్రాలలో స్థాయీ సంఘాల పనితీరును పరిశీలించినట్లు ప్రకటించారు. ఈ అనుభవాల దృష్ట్యా వాటి కంటే మెరుగైన విధివిధానాలలో రాష్ట్రంలో ఈ స్థాయిసంఘాల ఏర్పాటు చేయచున్నట్లు ప్రకటించారు.

నిజానికి ఈ స్థాయీ సంఘాలు చట్టసభలకు లోబడి ఏర్పడే సంస్థలే అయినప్పటికీ శాసనసభ, మండలి సభ్యులు వివిధస్థాయీ సంఘాలలో సభ్యులుగా వుండి బడ్జెట్ పద్దులపైనా, గత చట్టాలు కొత్త బిల్లులపైనా లోతైన చర్చలు జరిపి సిఫారసులను సభల ముందుంచడానికి ఈ ఏర్పాటు వీలు కల్పిస్తుంది. ప్రజల నుండి విజ్ఞప్తులను స్వీకరించడం, నిష్ణాతుల పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడం ద్వారా మెరుగైన విధానాల రూపకల్పనకు ఇవి దోహదం చేస్తాయి. స్థాయీ సంఘాలలో వివిధ పార్టీలకు చెందిన సభ్యులున్నప్పటికీ, ఇవి కెమెరాల ముందు సమావేశాలు జరపకపోవడం, రాజకీయ లబ్ధికంటే సమస్యను అర్థం చేసుకుని పరిష్కరించడం మీద కేంద్రీకరించంతో ఏకాభిప్రాయ సాధనకు ఇవి దోహదం చేస్తాయి. రాష్ట్రంలో ప్రజలు నిరర్థకంగా భావిస్తున్న చట్టసభల పనితీరును ఈ స్థాయీ సంఘాలు గుణాత్మకంగా మార్చివేస్తాయి. వచ్చే శీతాకాల సమావేశాలలోనే ఈ స్థాయీ సంఘాలు ఏర్పాటు జరిగితే రాష్ట్రంలో ప్రజ సమస్యల పైనా, బిల్లులపైనా, వివిధశాఖల పద్దులపైనా అర్థవంతమైన చర్చ ప్రారంభం అవుతుందని, చట్టసభల పనితీరుపై ప్రజల విశ్వాసం మరింత పెంపొందుతుందని ఆశిద్దాం. అందుకు అనుగుణంగా చట్టసభల సభ్యుల ఆలోచనా సరళి మారుతుందని భావిద్దాం. ◆




# కార్టూన్ కార్నర్

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
8-2-674బి/2/9, ప్లాట్ నం : 93
హ్యాపీ వ్యాలి, రోడ్ నం. 13ఎ,
బంజారాహిల్స్, హైదరాబాద్ - 500 034

**ఫోన్ నంబర్లు :**
**040- 23311817, 23311819,**
**23311820, 23312829**
**ఫ్యాక్స్ : 040-23310612**
accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

*జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం:* **040-23311817**

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

*చందా రుసుమును "లోక్‌సత్తాటైమ్స్" ఎకౌంట్ నం: 62007167836 ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.*

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

# స్వాహా రాజ్యం అంతం కోసం సురాజ్య ఉద్యమం

## అవినీతిపాలన అంతం కోసం మహోద్యమం : లోక్‌సత్తా రాష్ట్ర కార్యవర్గ నిర్ణయాలు

**ఆగస్టు 10 నుండి సురాజ్యఉద్యమం ప్రారంభం**

**డిశంబర్ 9 అంతర్జాతీయ అవినీతి వ్యతిరేకదినం వరకు తొలిదశ కొనసాగింపు**

- **రాష్ట్రంలో బలమైన లోకాయుక్త చట్టం**
- **పౌరులకు హక్కుగా ప్రభుత్వ సేవల చట్టం**
- **నిత్యజీవితంలో అవినీతిపై ప్రజా ఛార్జిషీట్లు**

**కోటిమందిని చేరేందుకు ప్రత్యేక కార్యక్రమాలు**

'క్విట్ ఇండియా డే' మరుసటిరోజు ఆగస్టు 10నుంచి అవినీతి రాజ్యాన్ని అంతం చేయటం, సురాజ్యాన్ని సాధించటం ఎజెండాతో రాష్ట్రవ్యాప్త ఉద్యమాన్ని ప్రారంభిస్తున్నామని, డిసెంబర్ 9న అంతర్జాయతీయ అవినీతి వ్యతిరేక దినం వరకూ కనీసం కోటిమంది ప్రజలను చేరుకోవటం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ప్రకటించారు. వ్యవస్థలోని అవినీతిని అంతం చేయటంతోపాటు వ్యవస్థను బాగుచేసుకుని సురాజ్యాన్ని సాధించటానికి అధికారాన్ని జనం చేతికి ఇవ్వటం, విద్య, ఆరోగ్యంకు పెద్దపీట వేయటం, మద్యాన్ని నియంత్రించటం, వ్యవసాయాన్ని లాభసాటి చేయటం, పేదరికాన్ని నిర్మూలించి ప్రతి పౌరుడూ ఆత్మగౌరవంతో తలెత్తుకుని బతికేలా చేయటం తదితర అంశాలపై ప్రజలను చైతన్యపరచటం ఈ ఉద్యమంలో ప్రధానభాగమన్నారు. యువత, రైతులు, మహిళలు, మధ్యతరగతి పెద్దఎత్తున ఈ




కార్యక్రమాలలో పాల్గొనాలని జేపీ పిలుపునిచ్చారు.

జూన్ 28,29 తేదీలలో ఇక్కడ లోకసత్తా పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్ణయాలను జయప్రకాష్ నారాయణ్ మీడియాకు వివరిస్తూ... అవినీతి వ్యతిరేక– సురాజ్య తొలిదశ ఉద్యమంతోపాటు లోక్‌సత్తా పార్టీ సభ్యత్వ నమోదు, రహస్య బ్యాలెట్ ద్వారా పార్టీ సంస్థాగత ఎన్నికలను నిర్వహించి పార్టీని పూర్తిస్థాయిలో ప్రజాస్వామీకరించేందుకు షెడ్యూల్‌ను కూడా ఈ సమావేశాలలో ఖరారుచేశామని తెలిపారు.

**సెప్టెంబర్ 30 వరకు సభ్యత్వ నమోదు...**

**రహస్య బ్యాలెట్ ద్వారా పార్టీ సంస్థాగత ఎన్నికలు**

"జులై 1వ తేదీ నుంచి సెప్టెంబర్ 30 వరకూ పార్టీ

పెద్దఎత్తున క్రియాశీలక సభ్యత్వ నమోదు జరుగుతుంది. అక్టోబర్ 31న పార్టీ సభ్యుల/ఓటర్ల ముసాయిదా జాబితాను ప్రకటించిన అనంతరం నవంబర్ 15న పార్టీ సంస్థాగత ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటిస్తాం. రాష్ట్ర, జిల్లా, నియోజకస్థాయి వరకూ ఈ ఎన్నికలు జరుగుతాయి. పార్టీతో సంబంధంలేకుండా బైటి నుంచి వచ్చిన నిష్పాక్షిక నిష్ణాతులతో స్వతంత్ర ఎన్నికల సంఘం ఈ ఎన్నికలను నిర్వహిస్తుంది. పార్టీ సంస్థాగత ఎన్నికలపై వారిదే తుదినిర్ణయం. పార్టీలో ఎన్నికలలో పాల్గనని బృందం మాత్రమే వారికి కావలసిన సహాయసహకారాలను అందిస్తుంది. 2009లో పార్టీ అధ్యక్షపదవిసహా తొలిసారి ఇలా ప్రత్యక్ష ఎన్నికలు జరిగాయి. ఆ ప్రక్రియను మరింత పటిష్టం చేసి, దొంగసభ్యులు లేకుండా నిబద్ధత, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేసే సభ్యులతో ఎన్నికల ప్రక్రియను నిర్వహించి పార్టీని పూర్తిస్థాయి ప్రజాస్వామ్యయుతంగా మార్చేందుకు ఇప్పుడు ప్రయత్నం చేస్తున్నాం" అని జేపీ తెలిపారు.

రాష్ట్రంలో, దేశంలో రాజకీయపార్టీలు కొంతమంది వ్యక్తుల సొంత ఎస్టేట్‌లుగా మారాయని, సామాన్యులు ఎంత సామర్థ్యమున్నా ఆ పార్టీలలో ఎదిగే అవకాశంలేదని, వాటికి పూర్తి భిన్నంగా లోక్‌సత్తా పార్టీని సొంతం చేసుకోవాలని ప్రజలకు జేపీ విజ్ఞప్తి చేశారు. సామాన్యప్రజలకు రాజకీయ భాగస్వామ్యం కల్పించకపోతే ఈ దేశానికి తీరని అన్యాయం చేసినవారమవుతామని అన్నారు. మనకంటే తక్కువ సమస్యలున్న జర్మనీ, అమెరికా, బ్రిటన్ వంటి దేశాలలో ఏంజిలా మెర్కెల్, ఒబామా, కామరాన్, టోనీ బ్లెయిర్ వంటి సామాన్యులు తమ సామర్థ్యంతో పార్టీలో చకచకా ఉన్నతస్థానాలకు ఎగబాకి, దేశానికి దిశానిర్దేశం చేస్తుంటే... ఎన్నో సమస్యలున్న భారతదేశంలో పార్టీలు వ్యక్తిగత ఆస్తులుగా మారటం వల్ల రాజకీయం, దేశాభివృద్ధి కుంటుపడి ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. వారసత్వ రాజకీయాలకు, ఆధునిక రాచరికానికి, వికృత అవినీతికి ఆలవాలంగా మారిన ఆ రాజకీయ సంస్కృతిని మార్చి పార్టీని ప్రజలకు వేదికగా చేసే రీతిలో లోక్‌సత్తా పార్టీ సంస్థాగత ఎన్నికలు, నిర్మాణం జరుగుతున్నాయన్నారు. "మీరు నాయకుల కొడుకోకూతురో కానక్కర్లేదు, మీకు కోట్లరూపాయలు ఉండనక్కర్లేదు, సామర్థ్యం, నిజాయతీ, సమాజం కోసం కొంత కష్టపడి పనిచేసే లక్షణం ఉంటే చాలు. లోక్‌సత్తా పార్టీ మీకు అవకాశం ఇస్తోంది. ఇంతకంటే మెరుగైన ఆలోచనలు, విధానాలు కూడా మీ దగ్గర ఉండవచ్చు. నిరాశను వీడండి. వాటిని వినియోగించి దేశం కోసం కృషి చేయటానికి లోక్‌సత్తా వేదికను వినియోగించుకోండి. ఇంతకంటే మంచి అవకాశం మరోటి మీకు లభించదు" అని జేపీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

అధ్యక్షపదవికి నేను పోటీచేయను, జాతీయస్థాయిలో కొనసాగుతా

రహస్య బ్యాలెట్ ద్వారా జరిగే పార్టీ సంస్థాగత ఎన్నికలలో ఎవరైనా ముఠాలు కట్టి ఒక ప్యానల్‌గా ఏర్పడి ఓటు కోసం ప్రచారంచేసుకున్నా, కులం,మతం,ప్రాంతం,భాష పేరుతో రెచ్చగొట్టే ప్రయత్నం చేసినా, ఏదైనా ప్రలోభాలు ఇచ్చినా వారు ఎన్నికలలో పోటీకి అనర్హులవుతారని జేపీ స్పష్టంచేశారు. గతంలోనే ప్రకటించినట్టు తాను రాష్ట్ర అధ్యక్షపదవికి పోటీచేయబోవటం లేదని జేపీ పునరుద్ఘాటించారు. జాతీయ అధ్యక్షునిగా తాను కొనసాగుతానని, మిగతా రాష్ట్రాల పార్టీ విభాగాలతో కూడా చర్చించి అక్కడ కూడా ప్రజాస్వామ్యబద్ధంగా పార్టీ నిర్మాణం చేపడతామని తెలిపారు. మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు దాదాపు సగం పదవులలో ప్రాతినిధ్యం ఉండే ఏర్పాటు చేశామని, యువతకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నామని జేపీ తెలిపారు.

## విద్యుత్‌రంగంలో తీవ్రమవుతున్న సంక్షోభం

రాష్ట్రప్రభుత్వం అనుసరిస్తున్న అవినీతి, అసమర్థ, మూర్ఖపు విధానాల వల్ల విద్యుత్‌రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయి ఉందని, మరో ఐదేళ్లు ఇదేతీరు కొనసాగితే ఇప్పుడున్న రూ.7400కోట్ల నష్టం కాస్తా రూ.20,000 కోట్లకు ఎగబాకుతుందని, ప్రపంచంలోనే ఒక రాష్ట్రస్థాయిలో ఇది రికార్డు అవుతుందని జేపీ అన్నారు. ప్రభుత్వం మౌలికసంస్కరణలు చేయకుండా ఈఆర్‌సీ కాస్త రేట్లు పెంచటం వంటి చిట్కాలతో కాలక్షేపం చేస్తుంటే, ప్రతిపక్షంలోని సాంప్రదాయ రాజకీయ (సా.రా) పార్టీలు కూడా సమస్యను అర్థం చేసుకోకుండా ఓటుబ్యాంకు రాజకీయాలు చేస్తున్నాయని, ఆ రాజకీయం తీరు రాష్ట్రాన్ని అంధకారంగా మారుస్తోందని అన్నారు. ఇక పరిశ్రమల స్థాపన, యువతకు ఉపాధి ఎండమావులే అవుతాయని జేపీ ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ పంపిణీలో నష్టాలను, అవినీతిని ఎలా ఆపాలో తాము ఉద్యమసంస్థగా ఉన్నప్పుడే పశ్చిమ గోదావరి జిల్లా కల్లచెర్వులో చేసి చూపించామని, ప్రభుత్వం

ఇప్పటికి కూడా ఆ విధానాలను అమలుచేసేందుకు ముందుకు రావటంలేదని అన్నారు.

**వామపక్షాలతో కలిసి పనిచేస్తాం**

రాష్ట్రంలో ఇప్పుడున్న పరిస్థితులలో నిజాయతీ, నిబద్ధత గల రాజకీయ ప్రత్యామ్నాయం కావాలని, అందుకు తమ శక్తిచాలదని, అలాగే జాతీయస్థాయిలో ఎన్నికల వ్యవస్థలో మార్పు తెచ్చి దామాషా ఎన్నికల వ్యవస్థను తేవాలని, ఈ లక్ష్యాల కోసమే వామపక్ష పార్టీలతో కలిసి పనిచేస్తున్నామని జేపీ ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. సైద్ధాంతిక విభేదాలున్నా లోక్‌సత్తాకు, వామపక్షాలకు మధ్య ఎజెండాలో సారూప్యాలున్నాయని, అందుకే కలిసొచ్చిన చోట కలిసొచ్చిన మేర కలిసి పనిచేస్తామని తెలిపారు. రాజకీయంగా అంటరానితనం ఉండకూడదని, ప్రజాప్రయోజనాల కోసం అంశాలవారీగా వివిధ పార్టీలతో కలిసిపనిచేస్తామని స్పష్టంచేశారు.

**తెలంగాణ సమస్య పరిష్కారంలో సహకారం...**

రాయల తెలంగాణ ప్రతిపాదనపై అడిగిన ప్రశ్నకు జవాబిస్తూ... ప్రజల ఆకాంక్షల్ని పరిగణలోకి తీసుకోవాలని, సమగ్రమైన చర్చ, సామరస్య పరిష్కారంలో భాగంగా వచ్చే తెలంగాణను లోక్‌సత్తా పార్టీ స్వాగతిస్తుందని తొలినుంచీ చెబుతున్నామని జేపీ చెప్పారు. రాయల తెలంగాణ అనే ప్రతిపాదన ఇలాంటి పరిష్కారమెకాదో తమకు తెలియదని అన్నారు. రాష్ట్రంలోని 8 పార్టీలు తమ అభిప్రాయం చెప్పాకే తెలంగాణపై నిర్ణయం ఉంటుందని కేంద్ర హోంమంత్రి చెబుతున్నారని, ఆ పార్టీలలో లోక్‌సత్తా లేదని, కాబట్టి ఆ అంశం మీద తేల్చాల్సింది ఆ పార్టీలేనని అన్నారు. అయితే ఆ క్రమంలో తనవంతు సహాయసహకారాలను అందించటానికి లోక్‌సత్తా పార్టీ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని జేపీ తెలిపారు.

**పారిశ్రామిక ప్రమాదాల నివారణపై నివేదికకు తక్షణం నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేయాలి**

శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం చిలకలపాలెం సమీపంలో నాగార్జున అగ్రి కెమికల్స్‌లో జరిగిన ప్రమాదం పట్ల జేపీ దిగ్భ్రాంతిని, విచారాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్రప్రభుత్వం కంటితుడుపు సహాయ చర్యలకు పరిమితంకాకుండా... లోపాల్ని గుర్తించి, అవినీతి లేకుండా, కార్మికుల భద్రతకు భరోసా ఇచ్చేలా ఒక ఉత్తమ పారిశ్రామిక విధానాన్ని రూపొందించటం కోసం నాలుగు వారాలలోగా నివేదిక ఇచ్చేలా ఒక నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని, తదనుగుణంగా తగిన చర్యల్ని తీసుకోవాలని జయప్రకాష్ నారాయణ్ డిమాండ్ చేశారు. ◆


## సురాజ్యఉద్యమం పై లోక్‌సత్తా టైమ్స్ ప్రత్యేక సంచిక

లోక్‌సత్తా పార్టీ తలపెట్టిన సురాజ్యఉద్యమంపై 2012 ఆగస్టు 1-16 'లోక్‌సత్తా టైమ్స్' ను ప్రత్యేక సంచికగా వెలువరిస్తున్నాం. దేశంలో, రాష్ట్రంలో అవినీతికి మూలంగా వున్న రాజకీయ వ్యవస్థను, ఎన్నికల వ్యవస్థను విశ్లేషించే వ్యాసాలు అవినీతి విశృంఖలత్వాన్ని వివరించే వ్యాసాలను ప్రజల భాగస్వామ్యంతో అవినీతిరహిత పాలన కోసం చేపట్టాల్సిన బహుముఖ కార్యకలాపాలను ఈ ప్రత్యేక సంచికలో పొందుపరచాలని భావిస్తున్నాం. ఈ అంశాలపై వ్యాసాలను, పాటలను, కార్టూన్‌లను పంపించాల్సిందిగా కోరుతున్నాం. వాణిజ్య, వ్యాపార, పారిశ్రామిక సంస్థలు, విద్యాసంస్థలు అందరూ ప్రకటనలు ఇచ్చి ఈ ప్రత్యేక సంచికకు సహకరించాల్సిగా కోరుతున్నాం.

### ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | - | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

లేదా

*"లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836 ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.*

accountsdept@loksatta.org loksattatimeslsp@gmail.com

## కొత్త మద్యం పాలసీ పేరుతో

# స్వంతముద్రకోసం కిరణ్ సర్కారు పాట్లు

- డి.వి.వి.యస్. వర్మ

సకాలంలో వర్షాలు పడకపోతే ఏరువాక ఆగిపోతుంది. విత్తనాలు అందించలేకపోతే అదను తప్పిపోతుంది. కాని జూలై1కి కొత్త మద్యం సంవత్సరం మాత్రం ఠంచనుగా ప్రారంభం కావలసిందే. ఇది సర్కారుకు బంగారు గుడ్లు పెట్టే బాతు. ఒక్క రోజు తేడా రాకుండా అన్ని ఏర్పాట్లు ఆఘమేఘాల మీద జరిగిపోవలసిందే. ఒక పక్క ఉప ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి, మరోక పక్క జైలు కెళ్లిన ఎక్సైజ్‌శాఖామంత్రి, ఇన్ని చిక్కుల్లో కూడా కొత్త మద్యం పాలసీని ఉడికీఉడక కుండానే వడ్డించడానికి రంగాన్నిసిద్ధం చేసింది సర్కారు.

గత 5,6 మాసాలుగా కొత్త మద్యం పాలసీ అంటూ ప్రభుత్వం హడావిడి చేస్తూ వచ్చింది. గత ప్రభుత్వాలు పోటాపోటీగా రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చాయి. లక్షలాది మంది ప్రజల జీవితాలను బుగ్గిపాలు చేస్తూ వచ్చాయి. ఇటీవల మద్యం సిండికేట్లపై ఏసిబి దాడులు ప్రకంపనాలు సృష్టించాయి. రాజకీయ నాయకులు, ఎక్సైజ్, పోలీసు అధికారుల కుమ్మక్కు వెలుగులోకి వచ్చింది. ఇందులో ఇరుక్కుపోకుండా బైటపడడానికి, పేదలకు మంచి చేస్తున్నామన్న ఖ్యాతి సంపాదించడానికి వీలుగా ప్రభుత్వం కొత్త మద్యం పాలసీని ప్రచారంలోకి తెచ్చింది. మద్యాంధ్రప్రదేశ్‌ను మద్యనియంత్రణ దిశగా మళ్లిస్తున్న భ్రమలు కల్పించింది. దేశంలో మేలైన మద్యం విధానాలను అధ్యయనం చెయ్యడానికి అధికారుల బృందాన్ని పంపింది. వారిచ్చే నివేదికను పరిశీలించడానికి మంత్రి వర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసింది. అన్ని పార్టీలతో చర్చలు జరిపి తుది నిర్ణయం చేస్తామని ప్రకటించింది. అంతిమంగా ప్రభుత్వం ఏ రిపోర్టునూ బైటపెట్టకుండా, అఖిలపక్ష సమావేశం లేకుండా ప్రభుత్వం ఏకపక్షంగా కొత్త మద్యం పాలసీని ప్రకటించింది. జూలై 1 నుండి కొత్తగా లాటరీతో లైసెన్సుల మద్యం అమ్మకాలకు ఏర్పాట్లను చేసింది. ఈ కొత్త మద్యం పాలసీ బాగోగుల్ని విశ్లేషించడానికి ముందు కిరణ్ సర్కార్ కొత్త మద్యం పాలసీకి దారితీసిన నేపధ్యాన్ని పరిశీలించుకోవడం అవసరం.

### ముద్రకోసం పాట్లు

కాంగ్రెస్ పార్టీ అధిష్టానం కిరణ్ కుమార్ రెడ్డిని ముఖ్యమంత్రిగా ఎంపిక చేసింది. ఆయన పార్టీలో నాయకుడిగా ఎదిగి ఎన్నికైన వారు కాదు. అంతకుమించి జనాకర్షణని, విశ్వసనీయతగా మూటగట్టుకున్న వారు కూడా కాదు. దీనికితోడు ఆయన ముఖ్యమంత్రి పదవిని అధిష్టించే నాటికి పాలన స్తంభించింది. పార్టీ అదుపు తప్పింది. పైగా రాజశేఖరరెడ్డి ప్రభావానికి ప్రజలు బలంగా గురైవున్నారు. ఈ స్థితిలో ప్రజలదృష్టిని ఆకర్షించడానికి కొత్త పథకాల రూపకల్పన కిరణ్‌కు తప్పనిసరి అయింది. వాటికి స్వంత ముద్ర తగిలించి నాయకునిగా ఎదగాల్సిన అవసరం వుంది. అయితే భారీ ఖర్చుతో కూడిన కొత్త పథకాలను ప్రకటించడానికి తగిన ఆర్థిక వెసులుబాటు లేకపోవడంతో పాత పథకాలకు కొత్త పేర్లు పెట్టడం, అటూ ఇటూ మార్చి తన ముద్రను తగిలించే పనికి పూనుకున్నారు. 2014లోగా 15లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తానని యువతకు ఎరగా గతంలోని రాజీవ్ యువశక్తి పథకానికి పేరు మార్చి, రాజీవ్ యువకిరణాల పేరుతో స్వంత ముద్రకోసం ఒక మెగా పథకంగా ప్రకటించారు. కాని ఆచరణలో అది పూర్తిగా దారితప్పింది. శిక్షణ ఇచ్చే సంస్థల దోపిడీకి, పాత ఉద్యోగాలనే కొత్త ఉద్యోగాలుగా చూపించడం వంటి కార్యకలాపాలతో అది అభాసుపాలైంది. శిక్షణ, ఉద్యోగాలు పక్కన పెడితే కనీసం దరఖాస్తు చేసుకునే వారు కూడా కరువైనట్లు వార్తలు వస్తున్నాయి. రాజశేఖరరెడ్డి కిలో 2 రూపాయల బియ్యాన్ని తెరమీదకి తెస్తే, కిరణ్ సర్కార్ దాన్ని మరిపించడానికి కిలో ఒక రూపాయి పథకాన్ని ప్రకటించింది. ఈ రూపాయ తగ్గింపు పేద ప్రజల్ని విశేషంగా ఆకర్షించేది కాకపోగా అన్నింటి ధరలు చుక్కలంటుతుంటే ఈ రూపాయి తగ్గింపు దేనికి అన్న ఈసడింపు ఎదురైంది.

ఇక మహిళా గ్రూపులను ఆకట్టుకోడానికి బ్యాంకుల అప్పు చెల్లిస్తే చాలు వడ్డీ సంగతి ప్రభుత్వం చూసుకుంటుందని

పావలా వడ్డీని తొలగించే ప్రకటనలు చేశారు. అయితే సకాలంలో చెల్లించడం లేదని బ్యాంకులు ఈ గ్రూపులకు అప్పులు నిరాకరించడాన్ని మాత్రం ప్రభుత్వం పట్టించుకోనందున వడ్డీ రద్దు ప్రయోజనం మహిళలకు దక్కడం లేదు.

ఇలా జనాకర్షణ కోసం, స్వంత ముద్ర కోసం ముఖ్యమంత్రి చేస్తున్న ప్రయత్నాలలో భాగంగానే ఇప్పుడు కొత్త మద్యం పాలసీని కిరణ్ కుమార్‌రెడ్డి ముందుకు తెచ్చారు. వేలం పాటలకి బదులు లైసెన్సులకు ఫీజులు, షాపులు దక్కించుకోడానికి లాటరీని పెట్టి మసిపూసి మారేడు కాయను చేసినట్టు పాత సారా, పాత సీసానే. "కొత్త మద్యం పాలసీ"గా కిరణ్‌సర్కారు ముద్రకోసం తయారు చేసుకున్నదే తప్ప వేరు కాదు.

కొత్త మద్యం పాలసీ పేరుతో జూన్ 18న ఒకే రోజున 390,391,392 జివోలను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ కొత్త పాలసీని ప్రకటించిన 390 జీ.వోలో కనీసం తన పాత విధానాన్ని వదిలించుకోడానికి కారణాలను గాని, కొత్త విధానంతో సాధించ తలపెట్టిన లక్ష్యాలనుగాని, ఈ మార్పుకు దోహదం చేసిన అధికార బృందం రాష్ట్రాల పర్యటనల అధ్యయన సారాంశంగాని, మంత్రివర్గ ఉపసంఘం సిఫారసుల ప్రస్తావనలుగాని మచ్చుకైనా లేకుండా వివిధ తరగతుల లబ్ధిదారుల (Stake holders) నుంచి వచ్చిన సలహాలను జాగ్రత్తగా పరిశీలించి ఈ పాలసీని రూపొందించినట్టు ప్రకటించి చేతులు దులిపేసుకున్నారు. ప్రభుత్వ నిర్లక్ష్య పూరిత వైఖరికి ఇది అద్దం పడుతుంది.

ఇక ఈ కొత్త పాలసీలో మొదటి అంశం రాష్ట్రంలో ప్రస్తుతం వున్న 6,596 షాపులు అదే ప్రాంతంలో యథాతథంగా వుంటాయి. రెండవది ఈ షాపుల్ని దక్కించుకోడానికి ప్రస్తుతం జరుగుతున్న వేలం పాటలకు బదులు ప్రభుత్వం జనాభా ప్రాతిపదికగా ఈ షాపులకు లైసెన్సు ఫీజులను నిర్ణయిస్తుంది. దరఖాస్తు దారులలో ఎవరిని లాటరీ వరిస్తుందో వారికి ఆ షాపు దక్కుతుంది. ఇదొక్కటే ఈ పాలసీ తెచ్చిన కొత్త పద్ధతి.

మన దేశంలో గుజరాత్ రాష్ట్రంలో మద్యనిషేధం అమలులోవుంది. ఢిల్లీ, తమిళనాడులలో ప్రభుత్వమే మద్యం షాపులను నిర్వహిస్తున్నది. కర్నాటక, మహారాష్ట్రలలో లాటరీ ద్వారా లైసెన్సులు ఇచ్చే పద్ధతి వుంది. ఆంధ్రప్రదేశ్‌తో సహా పలు రాష్ట్రాలలో వేలం పద్ధతి వున్నది.

లాటరీ ద్వారా లైసెన్సుల మంజూరు చేసే పద్ధతి మన రాష్ట్రానికి కొత్త కాదు. 1995 జనవరిలో యన్.టి.రామారావు ప్రభుత్వం మద్యనిషేధాన్ని అమలులోకి తెచ్చింది. ఆ ప్రభుత్వాన్ని కూల్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు 1997 ఏప్రిల్‌లో మద్యనిషేధాన్ని ఎత్తివేశారు. బాబు హయాంలో లాటరీ లైసెన్సుల పద్ధతి అమలు చేశారు. ఇంత బతుకూ బతికి ఇంటి వెనకాల చచ్చినట్టుగా కొత్త పాలసీకోసం అధికార బృందాల పర్యటనలు, మంత్రివర్గ ఉపసంఘాల భేటీల అనంతరం గతంలో చంద్రబాబు ప్రభుత్వం అనుసరించిన పద్ధతినే కిరణ్ సర్కారు నెత్తినెత్తుకుంది. బాబు సీసాలో కిరణ్ సారాగా ఈ కొత్త పాలసీ రూపుదిద్దుకుంది. 2004 వరకు అమలులో వున్న ఈ లాటరీ లైసెన్సు పద్ధతి పర్యవసానాలను స్టాక్‌హోం యూనివర్సిటీకి చెందిన మేరీ లార్సన్ తన పరిశోధనా గ్రంథంలో పూసగుచ్చినట్లు వివరించారు. ఈ కాలంలో గ్రామాలలో కిరణాషాపులలాగా వెలసిన బెల్టుషాపుల పరిస్థితిని, సిండికేట్లుగా మద్యం వ్యాపారులు సాగించిన దోపిడీని, లక్షలాది మంది పేదల బతుకుల్ని గుల్ల చేసిన వైనాన్ని వివరించారు.

ఏ రాయి అయితేనేం పళ్లు ఉడగొట్టుకోడానికి అన్నట్లుగా వేలం పద్ధతి అయినా లాటరీ లైసెన్సు పద్ధతి అయినా మద్యం వ్యాపారం ప్రయివేటు వ్యక్తుల పరం అవుతుంది. దాంతో లాభాపేక్ష రాజ్యం చేస్తుంది. రాజకీయ నాయకులు, ఎక్సైజు పోలీసు అధికారులు, మద్యం వ్యాపారుల కుమ్మక్కు ప్రారంభం అవుతుంది. అవినీతిలో సమస్త నియమ నిబంధనలు తుంగలోకి తొక్క బడతాయి. విచ్చలవిడి మద్యం అమ్మకాలు యధేచ్ఛగా సాగిపోతాయి.

పైగా ఈ కొత్త పాలసీలో మద్యం షాపుతోపాటు అదనంగా మరో లక్షరూపాయలు చెల్లిస్తే సిట్టింగ్ రూమ్‌లకు అనుమతిస్తారు. ఇప్పుడు బహిరంగంగా రోడ్ల మీదే సాగుతున్న తాగుడు సీను సిట్టింగ్ రూములలోకి మారుతుంది. దీనికితోడు తక్కువ జనాభా ఉన్న ప్రాంతానికి హెచ్చు లైసెన్సు ఫీజును నిర్ణయించడంతో అది విరివిగా మద్యం అమ్మకాలకు ప్రోత్సాహకారి అవుతుంది. ప్రివిలేజ్ ఫీజు విధించినందు వల్ల పొరుగు రాష్ట్రాల నుండి పన్నులు చెల్లించని మద్యం రవాణాకి దారితీస్తుంది. ఈ పాలసీలో యం.ఆర్.పి కంటే ఎక్కువకు అమ్మితే లైసెన్సు రద్దుచేస్తామన్న బెదిరింపు వున్నప్పటికీ

ఎంతవరకు అమలు అవుతుందన్నది ప్రశ్నార్థకమే? ఇక బెల్టుషాపులు ప్రస్తావనే ఈ పాలసీలో చోటు చేసుకోలేదు. మొత్తం మీద వేలంపాటలకు బదులుగా లాటరీ లైసెన్సు పద్ధతి తప్పిస్తే ఇందులో దాదాపుగా కొత్తదనం లేదు. ఇది మద్యనియంత్రణకు అడుగులు వేసేది కాదనేది స్పష్టం. పైగా అది లాభాపేక్షతో మద్యాంధ్రప్రదేశ్‌నే కొనసాగిస్తుంది. మద్యనియంత్రణ దిశగా అడుగులు వెయ్యడానికి ప్రభుత్వమే ఈ వ్యాపారాన్ని నిర్వహించడం తప్ప మార్గాంతరం లేదు. కాని సంప్రదాయ పార్టీల రాజకీయం దానికి దారితీసేది కాదు. ఎన్నికల్లో వీరంతా మద్యం పంపిణీ మీద ఆధారపడుతున్నారు. ఎన్నికల ఖర్చులకు మద్యం వ్యాపారాన్ని సాధనం చేసుకుంటున్నారు. ఈ కొత్త పాలసీ వీరికి అనుగుణంగానే రూపుదిద్దుకుంది. స్వంతముద్రకోసం కిరణ్ సర్కార్ ప్రకటించిన ఈ పాలసీ అయ్యవారిని చెయ్యబోతే కోతి అయినట్లుగా ఇది 2014 ఎన్నికలలో సర్కారు సానుకూల ఫలితాలకు బదులు ప్రతికూల పరిణామాలకే దారితీసేది అవుతుంది. ◆

# మద్యానికి గ్రామాలే 'నోట్ల' కొమ్మలు

- **50 వేల జనాభాలోపు పల్లెల్లోనే 4,900 మద్యం దుకాణాలు**
- **ఇక్కడ నుంచే రూ॥1,618 కోట్ల లైసెన్సు రుసుం**

రాష్ట్రంలో రానున్న కాలంలో గ్రామీణ ప్రాంతాల్లో నీటి సౌకర్యం లేకున్నా మద్యం మాత్రం అందుబాటులోకి రానుంది. రాష్ట్రంలో 6596 మద్యం దుకాణాలు ఉన్నాయి. వీటిలో 4900 దుకాణాలు 10 వేల లోపు నుంచి 50వేల వరకూ జనాభా ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నాయి. వేలం పాటల్లో పలు అక్రమాలు జరిగాయని, అధిక మొత్తంలో నిధులు పెట్టుబడిగా పెట్టి దుకాణాలు దక్కించుకున్న వ్యాపారులు అక్రమాలకు తెగబడ్డారని పేర్కొంటూ ప్రభుత్వం కొత్త విధానాన్ని ప్రకటించింది.

| జనాభా | లైసెన్సురుసుం | దుకాణాల సంఖ్య | మొత్తం ఆదాయం |
|---|---|---|---|
| 10వేల లోపు | రూ॥32.50లక్షలు | 3200 | రూ॥1040 కోట్లు |
| 10వేల నుంచి 50వేల వరకూ | రూ॥34 లక్షలు | 1700 | రూ॥578 కోట్లు |
| 50వేల నుంచి 3లక్షల వరకూ | రూ॥42 లక్షలు | 900 | రూ॥378 కోట్లు |
| 3లక్షల నుంచి 5లక్షల వరకూ | రూ॥46 లక్షలు | 200 | రూ॥ 92 కోట్లు |
| 5లక్షల నుంచి 20 లక్షల వరకూ | రూ॥64 లక్షలు | 226 | రూ॥144.64 కోట్లు |
| 20 లక్షల నుంచి | రూ॥1.04కోట్లు | 370 | రూ॥384.80 కోట్లు |
| | **మొత్తం** | **6596** | **రూ॥2617.44కోట్లు** |

ప్రస్తుతం ప్రవేశపెట్టిన విధానం వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి మద్యం దుకాణాల లైసెన్సు ఫీజు రుపేణా రానున్న ఏడాది కాలంలో రూ॥2,617 కోట్ల మేరకు ఆదాయం లభించనుంది. ఇందులో అత్యధిక భాగం గ్రామీణ ప్రాంతాల్లోని దుకాణాల నుంచే కావడం గమనార్హం. 50 వేల జనాభా ఉండే ప్రాంతాల నుంచి ప్రభుత్వానికి లైసెన్సు రూపేణా రూ॥1618 కోట్ల ఆదాయం రానుంది. అది కేవలం ఒక్క ఏడాదికి మాత్రమే. ఈ లెక్కలను పరిశీలిస్తే 62 శాతం మేరకు లైసెన్సు రుసుం కేవలం గ్రామీణ ప్రాంతాల్లోని దుకాణాల నుంచే రానుంది. గత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ॥15 వేల కోట్ల ఆదాయాన్ని మద్యం ద్వారా పొందింది. ప్రతి ఏటా అమ్మకాలను 15 శాతం పెంచేలా ప్రభుత్వం అనధికారిక లక్ష్యాలు విధిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ॥17,250 కోట్ల వరకూ మద్యం ఆదాయం పెరగనుంది. ఇందుకు తగిన విధంగా గ్రామీణ ప్రాంతాల్లోనూ అధికస్థాయిలో అమ్మకాలు చేపట్టాల్సి ఉంటుంది. ప్రభుత్వం కేవలం ఆ ప్రాంతాల్లోనే సుమారు రూ॥10,700 కోట్ల ఆదాయాన్ని పొందాల్సి ఉంది. ఇప్పటికే గ్రామాల్లో విచ్చలవిడిగా గరిష్ఠ చిల్లర ధర ఉల్లంఘనలు జరుగుతున్నాయి. రానున్న కాలంలో ఇవి పెరిగే ప్రమాదం ఉందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ◆

## కొత్తమద్యం విధానానికి వ్యతిరేకంగా

# లోక్‌సత్తా, వామపక్షాల రౌండ్‌టేబుల్ సమావేశం

## దీర్ఘకాలిక కార్యాచరణకు తీర్మానం

లాటరీ లైసెన్సుతో ప్రైవేటు వ్యక్తులకు దుకాణాలను కేటాయిస్తూ రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన కొత్త మద్యం విధానానికి వ్యతిరేకంగా జూన్ 26న రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర నిరసన వ్యక్తం చేయాలని లోక్‌సత్తా పార్టీ-వామపక్ష పార్టీలు, అనుబంధ సంఘాలు నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశం తీర్మానించింది. ఈ కొత్త విధానాన్ని వ్యతిరేకించే సంస్థలు, ప్రజాసంఘాలు పెద్దఎత్తున ఈ నిరసన కార్యక్రమాలలో పాల్గొనాలని పిలుపునిచ్చింది. 26న వామపక్ష పార్టీల రాష్ట్రనేతలతో కలిసి లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు జేపీ కూడా ఈ కార్యక్రమంలో పాల్గంటున్నారు. కొత్త మద్యం విధానానికి వ్యతిరేకంగా కార్యాచరణకు జూన్ 23న ఇక్కడ లోక్‌సత్తా పార్టీ ప్రధాన కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ సమన్వయకర్తగా జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో సీపీఎం, సీపీఐ నేతలతోపాటు వివిధ వామపక్ష పార్టీల, ప్రజాసంఘాల నేతలు పాల్గొన్నారు.

మద్యం వ్యాపారాన్ని ఏ రూపంలోనైనా ప్రయివేటు వ్యాపారుల చేతుల్లో పెట్టటం మద్యనియంత్రణకి దోహదం చేయకపోగా యధావిధిగా రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గానే కొనసాగిస్తుందని, అందువల్ల ప్రభుత్వం ప్రకటించిన కొత్త మద్యం పాలసీని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని సమావేశంలో పాల్గొన్న నేతలు స్పష్టంచేశారు. ప్రభుత్వమే మద్యం రిటైల్ వ్యాపారాన్ని నిర్వహించి, పరిమిత షాపులలో, పరిమిత వేళల్లో నిర్వహించాలని, ప్రభుత్వం ఈ మద్యం విధానాన్ని మార్చుకునేంత వరకూ ఉద్యమాన్ని దీర్ఘకాలం కొనసాగించటానికి సిద్ధం కావాలని రాష్ట్రప్రజలకు పిలుపునిచ్చారు. ఏసీబీ నివేదికను బైటపెట్టి దోషులను కఠినంగా శిక్షించాలని రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది.

లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు జేపీ ప్రసంగిస్తూ... రాష్ట్రప్రభుత్వం తెలిసితెలిసీ లక్షలమంది పేదకుటుంబాలను నాశనం చేసే మద్యం విధానాన్ని ప్రవేశపెట్టిందని ధ్వజమెత్తారు. మొత్తం



భారతదేశంలోనే మద్యం ద్వారా ఎక్కువ ఆదాయాన్ని పొందుతున్నది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమని, ముఖ్యమంత్రి అసెంబ్లీలో ప్రకటించిన లెక్కల ప్రకారమే ప్రస్తుతం జూన్‌తో ముగుస్తున్న ఎక్సైజ్ సంవత్సరానికి ప్రభుత్వానికి అధికారికంగా రూ. 22,000 కోట్ల ఆదాయం వస్తోందని అన్నారు. ఇదికాకుండా అనధికార, అక్రమ, కల్తీ మద్యం వంటివి ఉన్నాయన్నారు. ప్రభుత్వ పథకాలకు మొత్తం అధికారిక లెక్కల ప్రకారమే ఏటా రూ. 20,000 కోట్లు ఖర్చు చేస్తున్నామని చెప్పుకుంటున్న ప్రభుత్వం అదే పేదప్రజల నుంచి మద్యం పేరుతో దాదాపు రూ. 35,000 కోట్లు పిండుతోందన్నారు. ప్రివిలేజ్, ఎక్సైజ్ డ్యూటీ, అమ్మకపు పన్ను (వ్యాట్), వేలం ఫీజులలో ఇప్పుడు వేలం ఫీజు తప్ప మిగిలినవన్నీ కొత్త మద్యం విధానంలో యధావిధిగా కొనసాగిస్తూ మళ్లీ ప్రభుత్వం ప్రజల రక్తం పిండి మరీ వసూలు చేస్తుందన్నారు. పేద ప్రజల జీవితాల్ని నాశనం చేస్తున్న ఎక్సైజ్ విధానాన్ని మార్చి కొత్త విధానాన్ని ప్రవేశపెడతామని, అఖిలపక్షం నిర్వహించి మరీ కొత్త విధానాన్ని ఖరారు చేస్తామని ముఖ్యమంత్రి అసెంబ్లీలోనే ప్రకటించి చివరికి మాటతప్పి ఏకపక్షంగా పేదప్రజల రక్తం పీల్చే మద్యం విధానాన్నే ప్రవేశపెట్టారన్నారు.

లాభాపేక్షతో పనిచేసే ప్రైవేటు ప్రమేయం ఉన్నంతవరకూ పేదలు మద్యంబారిన పడుతూనే ఉంటాయని, బెల్టుషాపులు నడుస్తూనే ఉంటాయని జేపీ స్పష్టంచేశారు. ఏ ప్రభుత్వ, ప్రయివేటు దుకాణం నడవనంత స్థాయిలో తెల్లవారు జామునుంచి అర్థరాత్రి దాటాక కూడా తెరిచివుండేది మద్యందుకాణమేనని, తెలంగాణలో సకల జనుల సమ్మె జరిగినప్పుడు నష్టపోనిది ఎక్సైజ్‌శాఖ మాత్రమేనని గుర్తుచేశారు. ఇప్పటికే అనేక పల్లెల్లో చిన్నవయసులోనే అనేకమంది మహిళలు మద్యం వల్ల వైధవ్యం పొందారని వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలోని ఘటనల్ని ఉదహరిస్తూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వమే పరిమిత వేళల్లో, పరిమితంగా మద్యం దుకాణాల్ని నడపాలని, అక్రమ మద్యాన్ని నియంత్రించే అధికారాన్ని ఎక్సైజ్‌చట్టం ప్రకారం గ్రామపంచాయతీలకే అప్పచెప్పి, అక్కడ తప్పుజరిగితే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అప్పుడే ప్రజల భాగస్వామ్యం ఉద్యమంలో పెరుగుతుందన్నారు.

కొత్త మద్యం విధానంలో 10,000 జనాభా వున్న చోట, అంతకు ఎక్కువ జనాభా ఉన్న చోట లైసెన్సు ఫీజులో పెద్ద తేడా లేదని, అంటే జిల్లా కేంద్రంలో, మున్సిపాలిటీలో, 3,000 జనాభావున్న గ్రామంలో ఒకేలా తాగించి డబ్బులు గుంజాలని ప్రభుత్వం తీర్మానించుకుందని జేపీ అన్నారు. బెల్టుషాపుల నియంత్రణ, మద్యం అదుపు గురించి కనీసం ప్రస్తావన కూడా లేదన్నారు.

మద్యం వల్ల జరుగుతున్న నష్టం సాధారణమైనది కాదని, తాగుడు ఆపితే ప్రజలు తిరగబడతారనే ఉద్దేశంతో మద్యాన్ని పెంచిపోషిస్తున్నారని, మద్యనియంత్రణతో ఉద్యమాన్ని మొదలుపెట్టి అవసరమైతే నిషేధం వరకూ తీసుకెళ్లాలని స్పష్టంచేశారు. ఇందుకోసం దీర్ఘకాలిక పోరాటం అవసరమని, 2014 ఎన్నికలకు దీన్నో కీలకాంశంగా కూడా చేయాలని జయప్రకాష్ నారాయణ్ పిలుపునిచ్చారు.

సీపీఎం నేత వై. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ... రాష్ట్రంలో పెద్దనేతలు, మంత్రులు వివిధ జిల్లాలలో ప్రజాజీవితాన్ని శాసించేరీతిలో మద్యంవ్యాపారంలో భాగస్వాములుగా ఉన్నారన్నారు. మద్యంపై పోరాడేవారిని హెచ్చరికలా నిజాయతీపరులైన అధికారులను కూడా తొలగించే స్థాయిలో ప్రభుత్వం వ్యవహరించిందన్నారు. మద్యం డబ్బుతోనే ప్రభుత్వాన్ని నడపాలనే ఏకసూత్రంతో సర్కారు వ్యవహరిస్తోందని, కొత్త విధానం ఖరారుకు కనీసం వివిధ పార్టీలను, మహిళాసంఘాలను సంప్రదించే ప్రయత్నం కూడా చేయలేదన్నారు. వేలం బదులు లాటరీ రావటం తప్ప కొత్త మద్యం విధానంలో కొత్తదనమేమీ లేదన్నారు. బెల్టుషాపులు, మద్యనియంత్రణ మాటేలేదన్నారు. మద్యం వల్ల నష్టపోతున్నది దళితులు, పేదలు, గిరిజనులేనని, మద్యనియంత్రణ లేకపోతే మన వ్యవస్థలు ఆర్థికంగా, సామాజికంగా తీవ్రంగా దెబ్బతింటాయని, ప్రజాస్వామ్యం దెబ్బతింటుందని హెచ్చరించారు. 26న మద్యం లాటరీలకు వ్యతిరేకంగా పెద్దఎత్తున నిరసన వ్యక్తం చేయాలని విజ్ఞప్తి చేశారు.

సీపీఐ నేత కె. రామకృష్ణ మాట్లాడుతూ... ముఖ్యమంత్రికి వినే ఓపిక కూడా లేదని, అఖిలపక్షం కూడా పెట్టకుండా ప్రత్యక్ష దోపిడీ చేసే మద్యం విధానాన్ని ప్రకటించారని విరుచుకుపడ్డారు. మద్యం విధానం ఖరారుకు నియమించిన సబ్‌కమిటీలో సభ్యుడైన ఎక్సైజ్‌శాఖామంత్రి చంచల్‌గూడ జైలులో ఉన్నారని, ఏ తీరుగా ఈ విధానాన్ని ఖరారు చేశారో చెప్పాలని అన్నారు. ఒక్క బెల్టుషాపును మూయటం కూడా కష్టమైన పరిస్థితి ఈవేళ

**(తరువాయి 16వ పేజీలో...)**

# ఉపఎన్నికలు.. 2014 ఎన్నికలు...ఓ చర్చ

రాష్ట్రంలోని 18 అసెంబ్లీ స్థానాలకు, 1 లోక్‌సభ స్థానానికి జూన్‌లో జరిగిన ఉపఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత ఒక సీనియర్ పాత్రికేయ మిత్రుడు కన్పించాడు. నేను లోక్‌సత్తా పార్టీలో సభ్యుడిని కాకపోయినా ఒక పౌరుడిగా, జర్నలిస్టుగా ఆ పార్టీ భావజాలాన్ని ప్రజలలోకి తీసుకెళ్లటం అవసరమనే నిశ్చితభావంతో ఆ పార్టీలో పనిచేస్తున్నానని ఆ మిత్రుడికి తెలుసు. ఈ ఉప ఎన్నికలలో లోక్‌సత్తా పార్టీకి 2009లో వచ్చినన్ని ఓట్లు కూడా రాలేదటగా అని ఆ మిత్రుడు అడిగాడు. 'అది వాస్తవం కాదు, మరీ తీవ్రమైన పోటీ, భారీ ధనప్రవాహంవున్న ఒకట్రెండు స్థానాలలో తగ్గినా మొత్తంగా పార్టీ పోటీచేసిన ఐదు అసెంబ్లీ స్థానాలలో చూస్తే ఓట్లపరంగా గతంలో వచ్చిన ఓట్లను లోక్‌సత్తా నిలబెట్టుకుంది. రాక్షస రాజకీయ ప్రచారాన్ని తట్టుకుని కూడా పార్టీ ఆ ఓట్లను సాధించగలిగింది. అయితే చేసిన ప్రచారానికి తగ్గట్టు ఆశించిన ఓట్లను సాధించలేకపోయింది, ప్రభావం చూపలేకపోయింది అని మాత్రం అంగీకరించాల్సిందే' అన్నాను.

'ఈ ఉప ఎన్నికలలో ఎక్కువ ఓట్లు సాధించిన పార్టీలైన వైకాపా, కాంగ్రెస్, తెలుగుదేశంలు ఎటువంటి ఎజెండా లేకుండా ప్రజల ముందుకు వెళ్లాయి. సీపీఎంతో అవగాహన కుదుర్చుకుని పోటీచేసిన లోక్‌సత్తా పార్టీ మాత్రమే నిజమైన ప్రజాసమస్యల్ని, పరిష్కారాలకు తగిన విధానాలను ప్రజల ముందుకు తీసుకెళ్లింది' అన్నాను. ఖచ్చితంగా ఒక బలమైన ఎజెండాను ప్రజల ముందుకు లోక్‌సత్తా-సీపీఎం తీసుకెళ్లగలిగాయి, కొందరిని ప్రభావితం చేయగలిగాయి, అయితే అందరినీ చేరలేకపోయాయి. వైకాపా, కాంగ్రెస్, టీడీపీల స్థాయిలో గొంతును వినిపించలేకపోయాయి అని వివరించే ప్రయత్నం చేశాను. నా మాటల్ని మధ్యలోనే అడ్డుకుంటూ... లోక్‌సత్తా పార్టీకున్న ఓట్లు, సీట్లును బట్టే మీడియాలో కవరేజీ వస్తుంది. ఒక్క ఎమ్మెల్యే కాబట్టి, ఒకట్రెండు శాతం ఓట్లు కాబట్టే ఆ మేరకే కవరేజీ ఉంటుందని ఆ మిత్రుడు చాలా రొటీన్‌గా తేల్చిచెప్పాడు. 'అయ్యా, అవినీతి డబ్బు లేకుండా, పార్టీకి విరాళంగా తీసుకున్న ప్రతిపైసాకూ లెక్కచెప్పి, ప్రజల్ని ప్రలోభపెట్టకుండా, సొంత మీడియా ప్రచారం లేకుండా ఎన్నికలకు వెళ్లి ఆ మూడు సాంప్రదాయ రాజకీయ పార్టీలనూ లోక్‌సత్తా కంటే ఎక్కువ ఓట్లు, సీట్లు తెచ్చుకుని చూపించమనండి, ఖచ్చితంగా అప్పుడు మీరు చెప్పినట్టు ఓట్లు,సీట్లు శాతాన్ని బట్టే మీడియాలో కవరేజీ అనే సూత్రాన్ని నేను కూడా అంగీకరిస్తాను' అన్నాను. చాలాకాలం నెలజీతం కోసం, సౌకర్యాల కోసం ఒక రొటీన్ మీడియా ఫార్ములాలో అంతరాత్మని నిద్రపుచ్చి ఉంచిన నా మిత్రుడు కొంత మేలుకొన్నాడు. నువ్వు చెప్పిందీ కరెక్టేనన్నట్టు సాలోచనగా చూశాడు.

మీడియాకుగానీ, రాజకీయానికి గానీ గీటురాయి ఒక్కటే- ఎక్కువమంది ప్రజలకు ఎక్కువ మేలు చేయటం. ఆ కోణంలో చూసినా లోక్‌సత్తా పార్టీకి మీడియాలో గణనీయంగానే కవరేజీ వుండాలి అన్నాను. 'అధికారాన్నే మీడియా రాజకీయం అనుకుంటోంది తప్ప రాజకీయంలో అధికారం ఒక భాగం అనుకోవటం లేదు. అందుకే అధికారం తప్ప మరో అంశాన్ని పట్టించుకోకుండా, దేనికైనా దిగజారి అధికారంలోకి రావాలనుకుంటున్న సా.రా పార్టీల చేతిలో సాధనాలుగా మీడియా మిగిలిపోయింది' అని నిక్కచ్చిగానే చెప్పాను.

అది సరే, మీడియాతో సంబంధంలేకుండా ఆ సా.రా పార్టీలలాగే ప్రజలలో కొంత ప్రాచుర్యం పొందటానికి ఇతర పంథాలలో ప్రయత్నించవచ్చు గదా అన్నాడు నా మిత్రుడు. 'ఆ పంథాలకు, లోక్‌సత్తా విధానాలకు, రాజకీయ సంస్కృతికి కొంత మౌలిక వైరుధ్యముంది. ఉదాహరణకు సార్వత్రిక బంద్‌లు, రాస్తారోకోలు, భావోద్వేగాలను రెచ్చగొట్టటం వంటి ఆందోళనామార్గాలు, ప్రజల్ని ప్రలోభపెట్టి తరలించటం కొత్త రాజకీయానికి అంతిమంగా అవరోధమే అవుతాయి. మార్గాలు లక్ష్యాల్ని దెబ్బతీయకూడదు. అందుకే మీడియా తన వంతు పాత్రను పోషించటంతోపాటు మధ్యతరగతి, ఆలోచనాపరులు, యువత ఎక్కడికక్కడ స్థానికంగా నాయకత్వ బాధ్యత చేపట్టటం ఈ కొత్త రాజకీయానికి కీలకం' అన్నాను. 'ప్రపంచంలోని ఏ

దేశంలోని ఏ రాష్ట్రం/ప్రావిన్స్‌లో లేనంత మీడియా ఆంధ్రప్రదేశ్‌కు ఉంది. అయితే ఆ స్థాయి సానుకూల ప్రభావం మాత్రం చూపించలేకపోతోంది. ప్రజలలో గందరగోళాన్ని సరైన దిశలోకి మళ్లించే ప్రజాభిప్రాయాన్ని సవ్యంగా మలిచేందుకు తగినంత కృషి చేయలేకపోతోంది' అన్నాను. మా చేతుల్లో ఏముంది, అంతా మేనేజ్‌మెంట్, పైస్థాయివారి నిర్ణయం అని కాస్త ఆత్మరక్షణ ధోరణితో మరో కొత్తవాదన ఎత్తుకున్నాడు మిత్రుడు. మీడియా యాజమాన్యాలు సమస్యలో భాగమేకానీ, పూర్తిగా అదే సమస్య అనకు భాయ్. నైతికత, సృజనాత్మకత మీడియాకు ప్రాణవాయువు. వాటి ఆధారంగా మీరు కొంత కష్టపడితే సమాజానికి మేలు చేయవచ్చు అన్నాను. నా మిత్రుడు పిడివాద భావజాలంలో చిక్కుకుని లోక్‌సత్తా పార్టీ చెప్పే జవాబుదారీతనం, పారదర్శకత, స్వయందిద్దుబాటు స్వభావంతో కూడిన ఉదార ప్రజాస్వామిక భావాల్ని మొదట్లో గుడ్డిగా వ్యతిరేకించేవాడు. కానీ వాస్తవిక దృక్కోణం, ప్రజల పట్ల ప్రేమ ఉండటం వల్ల క్రమంగా లోక్‌సత్తా కృషిని, భావజాల విశిష్టతను, ఆవశ్యకతను గుర్తిస్తున్నాడు. జనం చేతికి అధికారానికి, వ్యక్తిగత స్వేచ్ఛకి, ఉదారవాద వ్యవస్థకి, చట్టబద్ధ పాలనకి, ప్రజాస్వామ్య వికాసానికి మధ్య అవినాభావ సంబంధాన్ని అర్థంచేసుకుంటున్నాడు. అందుకే సహేతుకంగా వివరించిన వెంటనే లోక్‌సత్తా పార్టీ ప్రాధాన్యత, మీడియాలో కవరేజీ ఆవశ్యకత అంశాల మీద సానుకూలంగా స్పందించాడు.

2014 ఎన్నికలు ఎలా ఉండొచ్చని అనుకుంటున్నారు అని అడిగాను. కులచిచ్చు రగిలిస్తున్నారు. ఇంకా అనేక ఇతర అంశాలున్నా ప్రధానంగా కులాల ప్రాతిపదికన ఓట్లు చీల్చటానికి వచ్చే ఎన్నికలలో భయంకరంగా ప్రయత్నం జరుగుతుంది అన్నాడు. వచ్చే ఎన్నికల దాకా అక్కర్లేదు జూన్‌లో జరిగిన ఉపఎన్నికలలో కూడా అదే జరిగింది కదా అన్నాను. కులసంఘాల పేరుతో కొందరు నేతలు అవినీతి డబ్బుల పార్టీలకు అమ్ముడుపోయి ఓట్లు అమ్ముకోండని సిఫార్సులు జరుగుతున్న ఒంగోలు ఉపఎన్నిక ప్రచారంలో లోక్‌సత్తా పార్టీ చాలా స్పష్టంగా, ఒక హెచ్చరికలా ఈ అంశాల్ని ప్రస్తావించింది అని వివరించాను.

## జనానికి 'కులం'- నాయకులకు 'అధికారం'

"చంద్రబాబు నాయుడు తన కుమారునికి తన బావమరిది బాలకృష్ణ కుమార్తెనే ఎందుకు చేసుకున్నారు? ఆస్తిలో ఆస్తి కలిసివస్తుందని, పార్టీ పగ్గాలు, అధికారం కుటుంబం దాటి వెళ్లకుండా వుంటాయని. అంతేతప్ప ఏదో కులం పట్ల మక్కువ ఉండి కాదు. ఆ ప్రయోజనాల కోసం మేనరికపు వివాహాలపై ఉన్న శాస్త్రీయ విశ్లేషణల్ని కూడా హైటెక్ ముఖ్యమంత్రినని చెప్పుకునే చంద్రబాబు తోసిపుచ్చారు. అలాగే వైఎస్ రాజశేఖర రెడ్డిగారు తన కుమార్తెకు తన కులంవ్యక్తిని కాకుండా వేరే కులం వ్యక్తిని ఎందుకు చేసుకున్నారు? చిరంజీవిగారు తన కుమారునికి బాగా డబ్బులున్న వేరే కులం నుంచి ఎంచుకుని ఎందుకు పెళ్లిచేశారు? ప్రేమించుకోవటంతోపాటు డబ్బు, పలుకుబడి కూడా కీలకం. ఆ ప్రయోజనాలు లేనప్పుడు కులం, గోత్రం వగైరాలను వాళ్లు ఖాతరు కూడా చేయరు. వాళ్లకు లేని కులం సామాన్య ప్రజలకు ఎందుకు? నాయకులకు కావలసింది అధికారం, డబ్బు తప్ప వారికి కులం ఉండదు. కులం పేరుతో ప్రజల్ని వెర్రెక్కించి ఓట్లు దండుకోవటం కోసం వాళ్లు కులాన్ని రెచ్చగొడుతుంటారు. ఎన్.టి రామారావు ముఖ్యమంత్రి కావటం వల్ల కమ్మకులం వారికి ఏమైనా ఒరిగిందా? అలాగే మిగిలిన కులాలవారికి ఆయా కులాల నుంచి మంత్రులు, ముఖ్యమంత్రులు కావటం వల్ల ఏమైనా ఒరిగిందా? అదో వెర్రి, పిచ్చి తప్ప దానివల్ల మెజారిటీ ప్రజల జీవితాలు బాగుపడవు. ప్రజల జీవితాలు బాగుపడాలంటే, మంచి విద్య, ఆరోగ్యం, ఉపాధి, స్థానికంగా అధికారాలు వంటి మౌలిక మార్పులు తెచ్చే విధానాలున్న రాజకీయం కావాలిగానీ, కులం నుంచి ఎన్నికైన వ్యక్తులు ముఖ్యం కాదు. ఇది తెలుసుకోకపోతే, తెలిసినవారు గట్టిగా నిలబడకపోతే ఈ రాష్ట్రం, దేశం, భావితరాలు మూల్యం చెల్లించాల్సి వస్తుంది. వ్యక్తిగత జీవితాలలోకి తొంగిచూడటం మా ఉద్దేశం కాదు. అలా ఎన్నడూ చేయం. కానీ కొన్ని సందర్భాలలో ప్రజాజీవితంలో ఉన్న వ్యక్తుల జీవితాల్ని, ప్రజాజీవితంలో వారి తీరును విడదీసి చూడలేం. అందుకే ఈ అంశాల్ని చెప్పాల్సి వచ్చింది"... ఈ భావాల్ని లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ప్రజలకు విస్పష్టంగా తెలియచేశారు అన్నాను.

మీడియాలోనే ఉన్నా ఇంత మౌలికమైన విషయాలు ఈ ఉపఎన్నికలలో ప్రచారం జరిగినట్టు నాకే తెలియదు అన్నాడు నా మిత్రుడు. నీకే కాదు, ఈ రాష్ట్రంలో చాలామందికి తెలియదు.

అందుకే ఉప ఎన్నికలలో మా ఎజెండాను బలంగా తీసుకెళ్లేందుకు గట్టిగా పోరాడినా మా గొంతు చాలలేదు అని లోక్‌సత్తా ప్రకటించింది అన్నాను. అలాగే ఈ ఎన్నికలలో ప్రధానంగా దెబ్బతిన్నది జనాభాలో మెజారిటీగా వున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, పేదవర్గాలు. సామాన్యులకు రాజ్యాధికారం ఇచ్చే లోక్‌సత్తా, వామపక్షాలలాంటి పార్టీలకు కాకుండా వారసత్వ, పెత్తందారీ పార్టీలకు ఓటువేయటం వల్ల తమ చేతులలో నుంచి అధికారం మరోసారి దూరం చేసుకుంటున్నామన్న స్పృహ లేకుండా వారు ఆ పార్టీలకు ఓట్లు వేశారు. మూడు సా.రా పార్టీలూ కలిసి అణగారినవర్గాలను వారి వేళ్లతో వారి కళ్లనే పొడిపించాయి. ముమ్ముందుగానీ ఈ తప్పిదాన్ని ఆయా వర్గాలు గుర్తించలేవు. అప్పటివరకూ జరిగే నష్టాన్ని వారు, వారితో పాటు సమాజం భరించకతప్పదు అన్నాను. మిత్రుడు పూర్తిగా ఏకీభవించాడు. అతను ఇంకా వినటానికి ఆసక్తి చూపటంతో నేను కాస్త వివరంగా విశ్లేషణ కొనసాగించాను.

'ఈ ఉపఎన్నికలలో అవినీతిపై పోరాటం పేరుతో కొందరు వ్యక్తుల అవినీతి మీద ఆరోపణలు చేయటంతప్ప అసలు అవినీతిని నిర్మూలించే అంశంపై ప్రచారం పెద్దగా జరగలేదు. లోక్‌సత్తా పదేపదే చెప్పినా సా.రా పార్టీల బాకాల రణగొణధ్వనిలో అది ప్రజలలో ఎక్కువమందికి చేరలేదు. చివరకు ప్రజలు కూడా ఎలాగూ అవినీతి నిర్మూలన గురించి మాట్లాడటం లేదు గదా, ఎవరు తినలేదు అనే ధోరణిలోకి వచ్చి ఓటు వేశారు. వనరుల దోపిడీకి వ్యతిరేకంగా వచ్చిన తెలంగాణ ఉద్యమానికి పురిటిగడ్డగా ఉన్న వరంగల్ జిల్లాలోని పరకాల ఉపఎన్నికలో... స్పష్టమైన ప్రాథమిక సాక్ష్యాధారాలతో భారీ అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ వ్యక్తి స్థాపించిన వైకాపాకు దాదాపు గెలుపు లభించేస్థాయి ఓట్లు రావటాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? అలాగే తెలంగాణకు వ్యతిరేకంగా లోక్‌సభలో ప్లకార్డు పట్టుకుని ఇప్పటికీ ఆ అంశంపై రాజకీయ క్రీడ ఆడుతున్న అవినీతిపార్టీకి ఓటు వేశారంటే ప్రజలలో తెలంగాణ పట్ల, అవినీతి అంతం చేయటం పట్ల ఆకాంక్ష లేదని అనుకోగలమా?' అన్నాను.

రాష్ట్రంలో మరో ప్రధానాంశంగా వున్న తెలంగాణపై అసెంబ్లీలో చర్చించాలని, సమగ్ర చర్చ, సామరస్య పరిష్కారంలో భాగంగా వచ్చే తెలంగాణను లోక్‌సత్తా స్వాగతిస్తుందని పరకాలలోనేకాకుండా రాష్ట్రవ్యాప్తంగా లోక్‌సత్తా ఒకేమాట చెప్పింది. ఎక్కువ స్థానాలు సీమాంధ్రలో ఎన్నికలు జరుగుతున్న తరుణంలో, తెలంగాణపై సానుకూలంగా మాట్లాడటానికి మూడు సా.రా పార్టీలూ ముఖం చాటేసిన సమయంలో లోక్‌సత్తా ఈ మాటల్ని నిర్ద్వంద్వంగా చెప్పింది. పెద్దల, గద్దల తెలంగాణకాకుండా లోక్‌సత్తాకు ఓటువేస్తే ప్రజల తెలంగాణ తెచ్చే ఎజెండా, విధానాలు, నిజాయతీ లోక్‌సత్తాకు మాత్రమే ఉన్నాయని స్పష్టంచేసింది. కానీ అసెంబ్లీలో సంఖ్యాబలముండి, అధికార, ప్రతిపక్షంగా తెలంగాణ సమస్యను పరిష్కరించాల్సిన ఎక్కువ బాధ్యత కలిగిన సా.రా పార్టీలు యధావిధిగా ప్రజల్ని మభ్యపెట్టే ప్రయత్నమే చేశాయి. రాజకీయ క్రీడలో భాగంగానే తెలంగాణ సమస్యను కొనసాగించటమే ధ్యేయంగా పనిచేశాయి' అని వివరించాను.

'దీనావస్థలో వున్న రైతులకు, కౌలుదారులకు వారి పండించిన ఉత్పత్తులకు లాభసాటి ధర తేవటం, మద్యం మహమ్మారి నుంచి గ్రామాలను, లక్షలాది పేద కుటుంబాలను కాపాడేందుకు కఠిన మద్యనియంత్రణను తీసుకురావటం గురించి ఉప ఎన్నికలలో తాను పోటీచేసిన ప్రతిచోటా లోక్‌సత్తా ప్రజలకు తెలియచెప్పిందితప్ప సా.రా పార్టీలు మాట్లాడిన పాపాన పోలేదు. ఒక ఉన్మాద వాతావరణాన్ని వ్యూహాత్మకంగా సృష్టించి ఇలాంటి మౌలికాంశాలు కొట్టుకుపోయేలా చేశారు' అన్నాను.

ఈ వాదనలు, వాస్తవాలు ప్రజలకు అర్థమవుతున్నాయి. కానీ ఓటుకి, తమ జీవితాలలో మేలిమి మార్పుకు ఉన్న సంబంధం వారికి ఇంకా పూర్తిగా అర్థం కావటం లేదు అన్నాను.

'రాష్ట్రాన్ని ఇన్నేళ్లూ పరిపాలించిన కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీల సాంప్రదాయ రాజకీయానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున ప్రజలు ఈ ఉప ఎన్నికలలో ఓటు వేశారు. ఆ రెండుపార్టీల రాజకీయం గతించిపోతున్న రాజకీయమని లోక్‌సత్తా 2010లో తెలంగాణ ఉప ఎన్నికలలో అవి మట్టికరిచినప్పుడే స్పష్టంగా ప్రకటించిన రాజకీయ పునరేకీకరణకు పిలుపునిచ్చింది. ఈవేళ ఆ మాటలు ప్రస్ఫుటంగా కనిపించాయి. ఆ రెండు పార్టీల నుంచే పుట్టుకొచ్చిన వైకాపా ఆ గతించిపోతున్న రాజకీయానికి పరాకాష్ఠగా పెద్దవిజయం సాధించింది. ప్రజలు కాంగ్రెస్, తెలుగుదేశాన్ని వ్యతిరేకించటం వరకూ స్పష్టంగా వ్యవహరించగలిగారుగానీ, వాటికి ప్రత్యామ్నాయంగా సరైన రాజకీయాన్ని, పార్టీని ఎన్నుకోవటంలో మాత్రం

విఫలమయ్యారు. ప్రత్యామ్నాయ రాజకీయ ఎజెండా గల పార్టీ, సమాజంలోని సమర్థులు, ఆలోచనాపరులు, మీడియా మూడూ కలిసికట్టుగా పోరాడితే తప్ప ఈ పరిస్థితిని మార్చటం సాధ్యం కాదు' అన్నాను.

2014కైనా ఆ దిశగా మార్పురావాలంటే పునస్సమీక్షకు, కార్యాచరణకు వారు కలిసిరావాలి. ప్రత్యామ్నాయ రాజకీయ ఎజెండా, వేదికగా లోక్‌సత్తా సిద్ధంగా ఉంది. ఇక మిగిలినవి ఇంకా సంసిద్ధం కావాలి. ప్రజలు మేలుకొని వారి శక్తిని వారు తెలుసుకుని వారికి మేలుచేసే కొత్తరాజకీయానికి అండగా నిలిచేంతవరకూ తదేకంగా, ప్రభావవంతంగా ఈ కృషి జరగాలి. సంకల్పం, స్పష్టత, ప్రజల పట్ల ప్రేమ ఉండాలేగానీ అదేమీ అసాధ్యం కాదు అన్నాను. స్పందన కోసం నా మిత్రుడి వైపు చూశాను. నేను ఎక్కువ మాట్లాడిన భావం అతనిలో ఏ కోశానా కన్పించలేదు. చాలా అవసరమైన చర్చ ఇది అన్నట్టు శ్రద్ధాసక్తులతో చూశాడు. జనరాజకీయం కోసం ఈ కృషిలో తనవంతు భాగస్వామ్యం అందించటం ఓ బాధ్యత, ఓ సంతోషం, తప్పక అందిస్తా అన్నట్టు తలూపాడు. ◆

**-21వ శతాబ్దపు భారతీయుడు**

# లోక్‌సత్తా, వామపక్షాల రౌండ్‌టేబుల్ సమావేశం....

**(12వ పేజీ తరువాయి..)**

రాష్ట్రంలో ఏర్పడిందన్నారు. పీసీసీ అధ్యక్షుడు తనకి కేవలం 31 మద్యం దుకాణాలు ఉన్నాయని సిగ్గులేకుండా చెప్పుకుంటున్నారని, ఇక మిగిలిన ప్రజాప్రతినిధులు, మంత్రుల లెక్క తేలాల్సుందని అన్నారు. 26న నిరసనలతోపాటు మద్యంపై దీర్ఘకాలికపోరాటాన్ని సన్నద్ధం కావాలన్నారు.

కొత్త మద్యం విధానం పేద, బడుగు, బలహీనవర్గాలనే ప్రధానంగా దోపిడీ చేస్తుందని ఆర్ఎస్‌పీ నేత జానకిరాం అన్నారు. మద్యనియంత్రణకు తాత్కాలిక పోరాటంగా చూడకుండా ఒక దీర్ఘకాలిక సామాజిక-ఆర్థిక-సాంస్కృతిక పోరాటంగా చేయాలని ఎస్‌యూసీఐ నేత మురహరి అన్నారు. స్థానిక సంస్థల నుంచి ఎన్నికలలో మద్యం కీలకపాత్ర పోషిస్తోందని, నియంత్రణతో మొదలుపెట్టి మద్యనిషేధం దాకా లోక్‌సత్తా, వామపక్ష శక్తులు పోరాటాన్ని కొనసాగించాలని ఎంసీపీఐ నేత వెంకటరెడ్డి, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ నేత సుజన్ రెడ్డి అన్నారు. మద్యం వల్ల అనారోగ్యంపాలైన పేదలకు ప్రభుత్వం కనీసం కౌన్సెలింగ్ కూడా చేయటం లేదని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య నేత డా॥ రజనీ అన్నారు. గతంలో పోరాటాల వైఫల్యాలను విశ్లేషించుకుని చిత్తశుద్ధితో ప్రత్యామ్నాయ పాలసీని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరముందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నేత ఎస్. రామారావు అన్నారు. గ్రామాలలో ఉపాధి హామీ ద్వారా వచ్చిన డబ్బులలో సగం డబ్బును మద్యానికే ఖర్చుచేస్తున్నారని, దీనివల్ల వ్యవసాయ కూలీల జీవితాలు దిగజారిపోతున్నాయని తమ సర్వేలో తేలిందని ఏఐడబ్ల్యుయు నేత క్రాంతి కిరణ్ తెలిపారు.

లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు డి.వి.వి.ఎస్ వర్మ తొలుత చర్చను ప్రారంభిస్తూ... ప్రస్తుతం ప్రభుత్వం ప్రవేశపెట్టిన లాటరీ మద్యం విధానం 2004కు ముందున్నదేనని, అప్పుడే బెల్టుషాపులు మొదలయ్యాయని అన్నారు. మద్యాన్ని ఒకపక్క ప్రభుత్వం ఆదాయమార్గం చేసుకుంటే, మరోపక్క మద్యం చుట్టూనే సాంప్రదాయ పార్టీల రాజకీయం కూడా అల్లుకుని ఉందని స్పష్టంచేశారు. అందుకే 2010లో వేలం విధానం ద్వారా మద్యం లైసెన్సులు పొందినవారిలో 50శాతం అధికార పార్టీకి చెందినవారు, మిగిలినవి ప్రధాన ప్రతిపక్షం సహా ఇతర సాంప్రదాయపార్టీలు పంచుకున్నాయని గుర్తుచేశారు.

సమావేశంలో లోక్‌సత్తా, మహిళాసత్తా నేతలు కటారి శ్రీనివాసరావు, ఎస్. మనోరమ, ఎన్. సరోజాదేవి, సర్వజనసత్తా, యువసత్తా, స్వతంత్ర రైతు సంఘాల సమాఖ్య నేతలు ఈద చెన్నయ్య, పి. శివాజీ రాజు, పి. భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

డి.వి.వి.ఎస్ వర్మ రౌండ్‌టేబుల్ సమావేశం తీర్మానాల్ని ప్రకటించగా, అందరూ ఆమోదం తెలిపారు. ◆

# రాష్ట్రంలో రానున్న 'ఒప్పంద వ్యవసాయం'

రాష్ట్రంలో కాంట్రాక్టు వ్యవసాయం పూర్తిస్థాయిలో మొదలుకానుంది. తొలిసారిగా ప్రభుత్వం దీనికి అధికారికంగా ఆమోదముద్ర వేసింది. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ మార్కెట్ల నిబంధనావళి- 1969'కి సవరణ చేస్తూ ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేసింది. పెద్ద నగరాల్లోని పెద్ద దుకాణాల వారు (మాల్స్) రైతులతో ముందుగా ఒప్పందాలు చేసుకుని కూరగాయలు సాగు చేయించి కొని తెచ్చుకుంటున్న మాదిరిగానే ఇకమీద పెద్ద పెద్ద కంపెనీలు రైతులతో ఒప్పందం చేసుకుని తమకు కావలసిన పంటలను పండిస్తాయన్నమాట!

ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) నియామావళి ప్రకారం వ్యవసాయోత్పత్తుల విషయంలో అంతర్జాతీయ వ్యాపార సరళిలో వస్తున్న మార్పులకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం 'మోడల్ మార్కెట్ చట్టాన్ని' ప్రయోగాత్మకంగా అమల్లోకి తెచ్చింది. ఇప్పుడు అందులో భాగంగా కాంట్రాక్టు వ్యవసాయం విధానానికి అనుమతిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తాజా ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇది పూర్తిస్థాయిలో అమల్లోకి వస్తే కనుక రాష్ట్ర వ్యవసాయ రంగంలో అత్యంత కీలక మార్పులు రానున్నాయి. అయితే ప్రభుత్వ పర్యవేక్షణ ఏమాత్రం లోపించినా పెద్దపెద్ద కంపెనీలు నేరుగా వ్యవసాయాన్ని శాసించే అవకాశం ఏర్పడే ప్రమాదం ఉందని కొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### కొత్త చట్టంలోని ప్రధా నాంశాలు...

- ప్రస్తుతం పెద్ద నగరాల్లోని పెద్ద దుకాణాల వారు (మాల్స్) రైతులతో ముందుగా ఒప్పందాలు చేసుకుని కూరగాయలు సాగు చేయించి కొని తెచ్చుకుంటున్నారు. ఈ వ్యవహారానికి ఇంత కాలం ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి కానీ ఒప్పందాలకు ఆమోదం కానీ లేదు.
- ప్రస్తుతం రాష్ట్రంలో చెరకు మిల్లులు చెరకు రైతులతో పామాయిల్ మిల్లులు అయిల్‌పాం రైతులతో ఒప్పందాలు చేసుకుని పంటను సాగు చేయిస్తున్నాయి. కానీ ఈ మిల్లుల సాగుకు నిర్దేశిత జిల్లాలు, మండలాలను ప్రభుత్వమే కేటాయిస్తోంది. తమకు కేటాయించిన ప్రాంతాల్లో రైతులు పండించిన చెరకు లేదా అయిల్‌పాం పంటను ఆ మిల్లులు కొంటున్నాయి. ఇక మరే ఇతర కంపెనీలకు, ఇతర పంటల సాగు, కొనుగోలుకు ఇలాంటి ఒప్పందాలు చేసుకునేందుకు ఇంతకాలం ప్రభుత్వం నుంచి అనుమతి లేదు.
- కొత్త ఉత్తర్వుల ప్రకారం... ఇక నుంచి ఏ కంపెనీ వారైనా నేరుగా రైతులు లేదా రైతు సంఘాలతో నిర్దేశిత దరఖాస్తు నమూనాలో ఒప్పందం చేసుకోవచ్చు. దీని ప్రకారం రైతులు



పండించిన పంటను సదరు కంపెనీకి ముందు ఒప్పందం చేసుకున్న ధరకే అమ్మాలి.

- ఒప్పందం కుదిరిన తరవాత 15 రోజుల్లోగా సమీప మార్కెట్ కమిటీకి తెలపాలి. భవిష్యత్తులో ఏమైనా తేడాలు వస్తే ఇరువర్గాల అంగీకారంతో ఒప్పందాన్ని రద్దు చేసుకోవచ్చు. అలా రద్దు చేసుకున్న 15 రోజుల్లోగా తెలపాలి.
- పంట ఉత్పత్తి మొదట చేసుకున్న ఒప్పందానికి అనుగుణంగా లేనప్పుడు (నాణ్యతలో కాని, పరిమాణంలోకాని) ఇద్దరూ చర్చించుకుని పరస్పర అంగీకారంతో ధరను మరోసారి నిర్ణయించుకోవచ్చు. ఆ ధర నచ్చకపోతే రైతులు తిరస్కరించి బయటి మార్కెట్‌లో అమ్ముకోవచ్చు.
- కంపెనీ చెల్లించే ధర ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరకన్నా తక్కువగా ఉండరాదు.
- ఒప్పందంలో పేర్కొన్న తేదీ వరకు మాత్రమే ఆ పత్రానికి విలువ ఉంటుంది. ఆ తరవాత ఒప్పందం రద్దయిపోతుంది. రైతు పంట సాగు చేసే పొలంపై కంపెనీకి ఎలాంటి హక్కులు ఉండవు. పంట కొనుగోలుకు మాత్రమే అది వర్తిస్తుంది.
- ఒప్పందం చేసుకునే ఏ కంపెనీ అయినా ముందుగా థర్డ్‌పార్టీ పూచీకత్తు కింద రూ॥2లక్షల బ్యాంకు గ్యారంటీని సంబంధిత జిల్లాలోని మార్కెటింగ్ సహాయ సంచాలకుడి (ఏడీ) పేరుతో ఇవ్వాలి. ◆

# సన్న ధాన్యానికి మరింత ప్రోత్సాహకం

## మద్దతు ధరపై క్వింటాలుకు రూ॥220 అదనం

సన్న రకాల ధాన్యానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహక ధరను ప్రకటించింది. కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) పై రూ॥220 అదనంగా ఇవ్వాలని నిర్ణయించింది. దీనివల్ల సన్న రకాల ధాన్యం ధర క్వింటాలుకు రూ॥1,500 అవుతుంది. రైతుల శ్రేయస్సును దృష్టిలో పెటుకుని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. పౌర సరఫరాల సంస్థ ప్రత్యేక కేంద్రాల ద్వారా ఈ ధాన్యాన్ని కొనుగోలు చేయనుంది. రైతులను ప్రోత్సహించడం ద్వారా సన్నరకాల ధాన్యం ఉత్పత్తికి, డిమాండ్‌కు మధ్య ఉన్న అగాథాన్ని తగ్గించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి ఎన్.కిరణ్‌కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పౌర సరఫరాల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు ప్రకటించారు. సన్నరకాల ధాన్యంలో సోనా మసూరి, సాంబ మసూరి, విజయ, తెల్ల మసూరి, మొలకొలుకులు, బీపీటీ వస్తాయని తెలిపారు.

కేంద్రప్రభుత్వం కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) క్వింటాలుకు రూ॥170 చొప్పున పెంచిందని, దీనివల్ల గ్రేడ్-ఎ రకం క్వింటాలు ధర రూ॥1,280, సాధారణ రకం ధర క్వింటాలుకు రూ॥1,250 అవుతుందని మంత్రి చెప్పారు. అయితే సన్న రకాలకు ఎంఎస్‌పీ కంటే క్వింటాలుకు రూ॥220 అదనంగా ఇచ్చి రైతుల వద్ద నుంచి రాష్ట్ర ప్రభుత్వం నేరుగా కొనుగోలు చేయనుందని తెలిపారు. ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని అక్టోబరు నాటికి పౌర సరఫరాల సంస్థ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని, వీటి ఏర్పాటుకు కార్యాచరణ ప్రణాళిక తయారవుతోందని అన్నారు. రాష్ట్ర అవసరాలకు 112 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం అవసరమని, ఇందులో 56 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే అందుబాటులోకి వచ్చిందని, లోటును తగ్గించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని అన్నారు. ప్రోత్సాహక ధర తెలియడం వల్ల రైతులు సన్న రకాల ధాన్యన్ని పండించేందుకు ముందుకు వస్తారన్న విశ్వాసాన్ని మంత్రి వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రకటించిన ధర కంటే బహిరంగ మార్కెట్‌లో ఎక్కువ వచ్చినప్పుడు రైతులు తమ ధాన్యాన్ని అమ్ముకోవచ్చని మంత్రి తెలిపారు. నాణ్యత పేరుతో రైతును ఇబ్బంది పెట్టకుండా చూస్తామని భరోసా ఇచ్చారు. సన్నరకాల అందుబాటు పెరిగినప్పుడు బియ్యం ధరలు కూడా అదుపులో ఉండే అవకాశముందన్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో 'మాల్స్' ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను పరిశీలించడానికి కమిటీని నియమించామని, నివేదిక వచ్చిన తరువాత పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని ఒక ప్రశ్నకు సమాధానంగా మంత్రి చెప్పారు. ◆

# విత్తనాల కోసం ముప్పతిప్పలు

*బ్లాక్ మార్కెట్‌లో అన్నదాత నిలువు దోపిడీ రూ॥950 ఉన్న పత్తి విత్తనాలు రూ॥1,500కు అమ్ముతున్న కంపెనీలు నల్ల బజారులో రూ॥200 కోట్లు నష్టపోనున్న రైతులు సోయాబీన్ విత్తనాలకు తీవ్ర కొరత... వేరుశనగకు నాణ్యత దెబ్బ చివరికి ఆముదం విత్తనాలు కూడా బ్లాక్ మార్కెట్‌లోనే....*

- **విత్తనాలు దొరక్క ముప్పతిప్పలు పడుతున్న రైతన్నలు**
- **బ్లాక్ మార్కెట్‌లో అన్నదాత నిలువు దోపిడీ**

విత్తు కష్టాలకు తెర లేచింది! మార్కెట్ మాయాజాలంలో రైతన్న ఎప్పట్లాగే నిలువు దోపిడీకి గురవుతున్నాడు!! గత ఏడాది కరువు నష్టాలను మరిచిపోయి కోటిఆశలతో ఏరువాకకు సిద్ధమవుతున్న రైతులను విత్తు కష్టాలు చుట్టుముట్టాయి. రాష్ట్రంలో ఎమ్మార్పీ ధరలకు నాణ్యమైన విత్తనం దొరకడం గగనంగా మారింది. 'అదనులో వ్యవసాయం...' అన్న మాటను రైతుల కంటే బాగా ఒంట బట్టించుకున్న విత్తన వ్యాపారులు.. అమాయక రైతుల అవసరాలను బ్లాక్ మార్కెట్ రూపంలో సొమ్ము చేసుకుంటున్నారు. విత్తనాలను ఉత్పత్తి చేయడమే ప్రధాన విధిగా ఉన్న ప్రభుత్వ ఆధ్వర్యంలోని 'ఏపీ సీడ్స్' వద్ద కూడా విత్తనాలు లేకపోవడంతో ప్రైవేటు వ్యాపారుల నుంచి సేకరిస్తోంది. ఇలా సర్కారు ఇచ్చేది ప్రైవేటు వ్యాపారులు సరఫరా చేసే విత్తనాలే కావడంతో నాణ్యతాపరమైన సందేహాలు తలెత్తున్నాయి. ఫలితంగా రైతులు చేసేది లేక పెద్ద కంపెనీల విత్తనాల వైపు చూస్తున్నారు. ఇదే అదనుగా కంపెనీలు అడ్డగోలు రేట్లతో రైతుల నడ్డి విరుస్తున్నాయి. రెట్టింపు ధరలకు విక్రయిస్తూ నిలువునా దోచుకుంటున్నాయి. ఈ అక్రమాలను నిరోధించాల్సిన వ్యవసాయశాఖ అన్ని దశల్లోనూ వ్యాపారులకే అండగా నిలుస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో జోరుగా వానలు కురుస్తుండడంతో రైతులు విత్తనాలు వేయడం మొదలు పెట్టారు. ఖరీఫ్‌లో 2.20 కోటి ఎకరాల్లో పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ ప్రణాళిక వేసింది. ఈ విస్తీర్ణంలో అన్ని పంటలు కలిపి 40.86 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అవసరమవుతాయని అంచనా వేసింది. వరి, వేరుశనగ, సోయాబీన్, కందులు, పెసలు, మినుములు, మొక్కజొన్నలు, జొన్నలు, రాగులు, సజ్జలు, ఆముదం, నువ్వులు, జీలుగ, జనుము, పిల్లిపిసర విత్తనాలు కలిపి 11.62 లక్షల క్వింటాళ్లను సబ్సిడీపై పంపిణీ చేయాలని నిర్ణయించింది. సకాలంలో విత్తన

### విత్తనాల కోసం బారులు ....

మెదక్ జిల్లా జహీరాబాద్ వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద రైతులు విత్తనాల కోసం భారీ సంఖ్యలో బారులు తీరారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు క్యూలో నిల్చున్నారు. భారీ వర్షం కురియడం, విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించడంతో పెద్ద సంఖ్యలో రైతులు వ్యవసాయశాఖ కార్యాలయానికి తరలి వచ్చారు. మధ్యాహ్నం వర్షం రావడంతో విత్తనాల పంపిణీ నిలిపివేశారు. కూపన్లు పొందిన రైతులకు తరువాత రోజు పంపిణీ చేస్తామని అధికారులు చెప్పారు. దీంతో కొందరు రైతులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో... పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దారు.

### పత్తి రైతు.. అంతులేని దోపిడీ

వచ్చే ఖరీఫ్‌లో రాష్ట్రవ్యాప్తంగా 50 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేస్తారని వ్యవసాయశాఖ అంచనా వేసింది. 36 కంపెనీలు సరఫరా చేసే1.27 కోట్ల పత్తి విత్తన డబ్బాలు/ప్యాకెట్లు (450 గ్రాములు) సరిపోతాయని నిర్ధారించింది. బ్లాక్ మార్కెటింగ్ రుచికి అలవాటు పడ్డ పెద్ద కంపెనీలు వ్యవసాయ శాఖ అధికారుల సహకారంతో పత్తి రైతులను దోపిడీ చేస్తున్నాయి. రైతులు ఎక్కువగా డిమాండ్ చేసే మహికో కంపెనీ...10 లక్షల డబ్బాల విత్తనాలు ఇస్తామని మొదట చెప్పింది. కానీ కేవలం 5 లక్షల డబ్బాలే ఇచ్చి చేతులు దులుపుకుంది. మిగిలిన సగం విత్తనాలను సొంత డీలర్ల ద్వారా రూ॥930 ఎమ్మార్పీ ఉన్న ఈ విత్తనాలను రైతులకు రూ॥1,500 చొప్పున బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తోంది. అక్రమ దందాలో పడిపోయిన మరో నాలుగు కంపెనీలు కూడా ఇలాగే చేస్తున్నాయి. సర్కారు అండతో జరుగుతున్న కంపెనీల బ్లాక్ మార్కెటింగ్‌తో పత్తి రైతులు ఒక్క ఈ ఖరీఫ్‌లోనే రూ॥200 కోట్ల మేర దోపిడీకి గురవుతారని అంచనా.

## సోయాబీన్... పెరిగిన భారం రైతులపైనే

గత ఖరీఫ్‌తో పోల్చితే సోయాబీన్ విత్తనాల ధరను సర్కారు క్వింటాల్‌కు రూ॥1,140 పెంచింది. గత ఏడాదిలో క్వింటాల్ సోయాబీన్ విత్తనాలను రైతులకు రూ॥1,540కి పంపిణీ చేయగా ఇప్పుడు రూ॥2,680కి పెంచారు. రాష్ట్రంలో సోయాబీన్ సాగు సగటు విస్తీర్ణం నాలుగు లక్షల ఎకరాలు. అవసరాలకు సరిపడా విత్తనాల సేకరణను నవంబర్‌లోనే చేయాల్సి ఉన్నా... వ్యవసాయ శాఖ, ఆంధ్రప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థ (ఏపీసీడ్స్) ఉన్నతాధికారులు పట్టించుకోలేదు. నవంబర్‌లో క్వింటాల్ సోయాబీన్ విత్తనాల ధర రూ॥2,014 ఉంది. వ్యాపారుల లబ్ధి కోసం ఆలస్యం చేయడంతో సోయాబీన్ విత్తనాల ధర అమాంతంగా క్వింటాల్‌కు రూ॥4 వేలకు పెరిగింది. ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా సోయాబీన్ విత్తనాల సేకరణ ఖర్చు రూ॥20 కోట్ల నుంచి రూ॥40 కోట్లకు పెరిగింది. అధికారుల నిర్లక్ష్యంతో పెరిగిన విత్తనాల సేకరణ ఖర్చును భరిచాల్సిన ప్రభుత్వం... దాన్ని రైతులపై వేసింది. అంతటితో ఆగకుండా సోయాబీన్ విత్తనాలను గత ఖరీఫ్‌లో 50 శాతం సబ్సిడీపై రైతులకు పంపిణీ చేయగా ఇప్పుడు దాన్ని 33 శాతానికి తగ్గించారు. దీంతో ఈ విత్తనాల ధర కూడా భారీగా పెరిగింది. నిజామాబాద్ జిల్లాలో ఎక్కువ మంది రైతులు ఈ ఏడాది సోయాబీన్ సాగు చేయాలని చూస్తున్నారు. సర్కారు మాత్రం వీరికి సరిపడా విత్తనాలను సరఫరా చేసే పరిస్థితి కనిపించకపోవడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది.

## వేరుశనగ... నాణ్యతకు సెగ

రాష్ట్రంలో 44 లక్షల ఎకరాల్లో సాగుచేసే వేరుశనగ విత్తనాలకు నాసిరకం సమస్య పట్టుకుంది. గత ఏడాది కరువుతో వేరుశనగ రైతులే ఎక్కువగా నష్టపోయారు. ఈ సమయంలో వారిని ఆదుకోవాల్సిన సర్కారు వేరుశనగ విత్తనాల ధరలను అడ్డగోలుగా పెంచింది. గత ఏడాది అన్ని రకాల వేరుశనగ విత్తనాల ధర క్వింటాల్‌కు రూ॥3,600 ఉండగా ఇప్పుడు రూ॥3,950 పెరిగింది. సబ్సిడీ విత్తనాల ధరకు, బహిరంగ మార్కెట్‌లో ధరలు తేడా లేకపోవడంతో ఎక్కువ మంది రైతులు సొంతంగానే విత్తనాలు సమకూర్చుకుంటున్నారు. గత ఏడాది కరువు పరిస్థితులకు తట్టుకుని బాగా దిగుబడి ఇచ్చిన కే6 రకం వేరుశనగ విత్తనాలకు ఇప్పుడు డిమాండ్ ఎక్కువగా ఉంది. వ్యవసాయ శాఖ మాత్రం వీటిని కాకుండా ఇతర రకాలను సిద్ధం చేసింది. దీంతో సబ్సిడీ విత్తనాలకు రైతులు ప్రాధాన్యం ఇవ్వడంలేదు. ఇదే అదనుగా కొందరు విత్తన వ్యాపారులు ఆయిల్‌ఫెడ్, హాకా, మార్కెఫెడ్ సంస్థల ద్వారా ధ్రువీకృతం అని చెప్పి సాధారణ విత్తనాలను సరఫరా చేశారు. ప్రాసెస్ కూడా సరిగా చేయకపోవడంతో కొనుగోలు చేసిన రైతులు బస్తాలు విప్పిచూస్తే ప్రతి బస్తాలో 6 కిలోలు విత్తుకు పనికి రాని తాలుకాయలు బయటపడుతున్నాయి. దీంతో రైతులు మళ్లీ విత్తనాలు కొనుగోలు చేయాల్సిరావడంతో సబ్సిడీకి అర్థమే లేకుండా పోతోంది.

రైతుల నుంచి విత్తనాలను సేకరించడంలో వ్యవసాయ శాఖ, విత్తన ఏజెన్సీలు విఫలమయ్యాయి. దీంతో విత్తన రైతులు తమ పంటను మార్కెట్‌లో అయినకాడికి అమ్ముకున్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసేందుకు మీనమేషాలు లెక్కించిన వ్యవసాయ శాఖ... ప్రైవేటు వ్యాపారుల నుంచి అధిక ధరలు వెచ్చించి విత్తనాలు సేకరించింది. వీటిని రూ॥153 కోట్ల సబ్సిడీతో రైతులకు సరఫరా చేసేందుకు సిద్ధమైంది. అయితే ఇవి నేరుగా విత్తన రైతుల నుంచి సేకరించిన విత్తనాలు కాకపోడంతో సర్కారు విత్తనాల నాణ్యతపై రైతుల్లో సందేహాలు నెలకొన్నాయి.

### చివరికి ఆముదం విత్తనాలు కూడా...

పత్తి విత్తనాల బ్లాక్ మార్కెటింగ్ రెండేళ్లుగా జరుగుతుండగా... రాష్ట్ర చరిత్రలో మొదటిసారిగా ఇప్పుడు ఆముదం విత్తనాలను బ్లాక్ మార్కెట్‌లో అమ్ముతున్నారు. రాష్ట్రంలో 5 లక్షల ఎకరాల్లో సాగు చేసే ఆముదం విత్తనాల ధరలను ప్రభుత్వం ఈ ఏడాది అమాంతంగా పెంచేసింది. గత ఏడాది వీటి ధర క్వింటాల్‌కు రూ॥5 వేలు ఉండగా ప్రభుత్వం 50 శాతం సబ్సిడీ ఇచ్చింది. దీంతో రైతులకు రూ॥2,500కే విత్తనాలు దొరికాయి. ఈ ఏడాది వాటి ధరను 5,200కు పెంచిన సర్కారు సబ్సిడీని రూ॥1,200లకు తగ్గించింది. దీంతో రైతులు క్వింటాల్‌కు రూ॥3 వేలు వెచ్చించి కొనుక్కోవాల్సి వస్తోంది. సర్కారే ధర పెంచినందున తాము పెంచితే తప్పేంటన్న ఉద్దేశంతో కంపెనీలు ఆముదం విత్తనాలను బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తున్నాయి. రూ॥400 ఉండే 3కిలోల ఆముదం విత్తనాల ప్యాకెట్‌ను మహబూబ్‌నగర్, రంగారెడ్డి, అనంతపురం జిల్లాల్లో కంపెనీలు రూ॥700లకు చొప్పున అమ్ముతున్నాయి. రైతుల ప్రయోజనాల విషయంలో రాష్ట్ర సర్కారుకు ఏ మాత్రం శ్రద్ధలేదని చెప్పేందుకు విత్తనాల్లో బ్లాక్ మార్కెట్ దందాయే నిదర్శమని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అధ్యక్షుడు కె.రామకృష్ణ మండిపడ్డారు. ◆

# జనాభా లెక్కలు - అపోహలు

- డి. మార్కండేయ

**జనాభా పెరుగుదలనే అన్ని సమస్యలకు కారణమనే విధానం సరికాదు. మానవ శక్తులే సకల ఉత్పత్తికి, అభివృద్ధికీ మూలమనే మౌలిక విషయాన్ని గుర్తించాలి. కేవలం జనాభా పెరుగుదలను అరికట్టడమన్న కోణంలోనే ఆలోచించకుండా పౌరులందరినీ ఉత్పత్తితో పాటు, అభివృద్ధి ఫలాల పంపకంలో సమ భాగస్వాములను చేసే విధానాలు అమలులోకి తేవాలి.**

జనాభా లెక్కలు – 2011, ప్రాథమిక నివేదిక ఇటీవల విడుదలైంది. వివిధ రాష్ట్రాల, జిల్లాల, పల్లెల, పట్టణాల, నగరాల జనాభాకు సంబంధించిన పూర్తి వివరాలను ఈ నివేదికలో పొందుపర్చారు. నివాసగృహాల సంఖ్యతోపాటు వాటికి సమకూరివున్న సదుపాయాలు, జనాభా పెరుగుదల రేటు, లింగ నిష్పత్తి, అక్షరాస్యత, జననాల–మరణాల రేటు, సగటు జీవితకాలం, ఎస్సీ, ఎస్టీలు, మతాల వారీగా జనాభా, పట్టణీకరణ తదితర అనేక వివరాలు ఇందులో ఉన్నాయి. నివేదికప్రకారం 2011 మార్చి1 నాటికి దేశ జనాభా 121 కోట్ల ఒక లక్షా 93 వేల 422 మందికి చేరింది. వీరిలో 62 కోట్ల 37 లక్షలు (51.54 శాతం) పురుషులు కాగా, 58 కోట్ల 64 లక్షల మంది (48.46 శాతం) స్త్రీలు. ఆరేళ్ల లోపు బాలలు 15 కోట్ల 88 లక్షలు. 19 కోట్ల 95 లక్షలతో ఉత్తరప్రదేశ్ దేశంలో అత్యధిక జనాభా కలిగిన రాష్ట్రంగా తన స్థానాన్ని నిలుపుకుంది. ఆ తర్వాతి స్థానాన్ని 11 కోట్ల 20 లక్షల జనాభా కలిగిన మహారాష్ట్ర ఆక్రమించింది. కేవలం 6 లక్షల 7 వేల జనాభాతో సిక్కిం అతి తక్కువ జనాభా కలిగిన రాష్ట్రంగా ఉంది. దేశంలోని వందకు పైగా జిల్లాలు సిక్కిం కంటే ఎక్కువ జనసంఖ్యను కలిగివుండడం విశేషం. అక్షరాస్యత 2011లో 64.83 శాతం ఉండగా, 2011 నాటికి అది 74.04 శాతానికి పెరిగింది. ఇక కనీస సౌకర్యాల విషయానికి వస్తే దేశ జనాభాలో 53.1 శాతం మందికి మరుగుదొడ్ల సౌకర్యం లేదు. 41.6 శాతానికి స్నానపు గదులు లేవు. 49.8 శాతం గృహాలకు డ్రైనేజీ సౌకర్యం లేదు. 68 శాతం గృహాలకు రక్షిత మంచినీటి సరఫరా లేదు. 32.8 శాతం ఇళ్లకు కరెంటు లేదు. 28.5 శాతం కుటుంబాలు వంటకు ఎల్పీజీని ఉపయోగిస్తుండగా, 65.8 శాతం మంది కట్టెలు, పిడకలతో వంట చేసుకుంటున్నారు. బ్యాంకు అకౌంట్ లేనివారు 41.3 శాతం కాగా, టీవీలు ఉన్నవారు 47.2శాతం, రేడియోలు మాత్రం ఉన్నవారు 19.9 శాతం, కంప్యూటర్లు ఉన్నవారు 6.3 శాతం. సైకిల్ ఉన్నవారు 44.8 శాతం, మోపెడ్ లేదా బైక్ ఉన్నవారు 21 శాతం, ఏ వాహనం లేనివారు 17.8 శాతం ఉన్నారు. జనాభాలో 63.2 శాతం మంది ఫోన్ సౌకర్యం కలిగి వుండడం గమనార్హం.

వివరాలు, రికార్డులు, శాతాలు ఇలా ఉంటే, ఈసారి జనాభా లెక్కలకు సంబంధించి గమనించాల్సిన ఆసక్తికరమైన అంశాలు కొన్ని ఉన్నాయి. వీటిలో ప్రధానమైనది జనాభా పెరుగుదల రేటు. మన దేశ జనాభా అసాధారణ రీతిలో వేగంగా పెరిగిపోతున్నదని, మరికొన్ని దశాబ్దాల్లో చైనాను సైతం అధిగమించి ప్రపంచంలోనే అగ్రస్థానాన్ని ఆక్రమించనున్నదని మనకు తెలుసు. 110 ఏళ్ల కిందట 23 కోట్ల 84లక్షలున్న జనాభా, ఐదు రెట్లు పెరిగి ప్రస్తుతం 121 కోట్లకు చేరడమే ఇందుకు నిదర్శనం. 1921 జనాభా లెక్కల నాటికి దశాబ్దపు పెరుగుదల కేవలం 0.31 శాతమే ఉండగా, 1971 నాటికి అత్యధికంగా 24.80 శాతానికి చేరి సర్వత్రా ఆందోళనకు కారణమైంది. ఆ తర్వాత ప్రభుత్వాలు ప్రత్యేకించి ఇందిరాగాంధీ ప్రభుత్వం కుటుంబ నియంత్రణ విషయంలో చేపట్టిన చర్యలు కొంతవరకు ఫలితాలనిచ్చాయి. అప్పటిదాకా పెరుగుదలను నమోదు చేసుకుంటున్న వృద్ధి శాతం పడిపోవడం ఆరంభమైంది. 1981లో 24.66శాతం, 91లో 23.86 శాతం, 2011లో 21.34 శాతం, మొన్నటి లెక్కల్లో 17.64 శాతం పెరుగుదల నమోదు కావడం గమనార్హం.

జననాల రేటు తగ్గాల్సినంత తగ్గకపోవడం మూలంగానే మన జనాభా అదుపులో లేని స్థాయిలో పెరిగిపోతోందని చాలా మంది భావిస్తుంటారు. ఇది నిజం కాదు. 1901 లో 49.2

(ప్రతి వేయి మందికి) గా ఉన్న జననాల రేటు క్రమంగా తగ్గుతూ 2011 నాటికి 20.9కి పడిపోయింది. అలాగే, స్త్రీల సాఫల్యతా రేటు కూడా బాగా తగ్గింది. 1951లో సగటున ప్రతి స్త్రీకి ఆరుగురు పిల్లలు పుడితే ప్రస్తుతం అది 2.62కి చేరింది. అంటే జనాభాలో అత్యధిక కుటుంబాలు కేవలం ఇద్దరు పిల్లలతోనే సరిపెట్టుకుంటున్నాయన్నమాట. మరి అసలు కారణాలేమిటి? అంటే సాధారణ మరణాల రేటు, శిశు మరణాల రేటు బాగా తగ్గడం. భారతీయుల సగటు జీవితకాలం బాగా పెరగడం, లెక్కల్లోకెళితే, 1901లో సంవత్సరానికి వేయిమందికి 42.6 మంది చనిపోతే 2011 నాటికి 6.9 మంది మాత్రమే ఈ లోకాన్ని విడిచి వెళుతున్నారు. మెరుగుపడిన సామాజిక, ఆర్థిక పరిస్థితులు, అందుబాటులోకి వచ్చిన ఆధునిక వైద్యం తదితరం ఇందుకు కారణాలుగా చెప్పుకోవచ్చు. ఇవే కారణాలతో దేశంలో శిశు మరణాల రేటు సైతం తగ్గింది. 1901లో ప్రతి వేయి జననాలకు 210 మంది శిశువులు ఆరేళ్లు పూర్తయ్యే లోపే కళ్లుమూస్తే ప్రస్తుతం 48 మంది శిశువులు మాత్రం చనిపోతున్నారు. ఇక, మన దేశ పౌరుల సగటు జీవితకాలం కూడా బాగా పెరిగింది. వందేళ్ల కింద 1911లో భారతీయులు సగటున కేవలం 23 ఏళ్లు మాత్రమే బతికేవారు. ప్రస్తుతం ఇది 65 ఏళ్ళకు చేరుకుంది.స్త్రీలు 66 ఏళ్ళు, పురుషులు 63 ఏళ్లు నిండేవరకూ బతికేస్తున్నారు. ఈ కారణాలన్నింటి మూలంగానే జనాభా ఆశించిన స్థాయిలో తగ్గడం లేదనే విషయాన్ని గుర్తించాలి.



జననాల రేటు తగ్గుతున్నది నిజమే గాని అందులో ఓ మతలబు దాగివుంది. ఆ తగ్గడంలో ఘోరమైన లింగ వివక్ష అమలవుతోంది. మగ జననాల కంటే ఆడ జననాలు బాగా తగ్గుతున్నాయి. ఫలితంగా దేశంలో లింగ నిష్పత్తి వేగంగా పడిపోతున్నది. 1901లో ప్రతి వేయి మంది పురుషులకు 972 మంది స్త్రీలు ఉండగా ప్రస్తుతం ఈ సంఖ్య 940కి పడిపోయింది. అమెరికా, రష్యా, జపాన్, ఫ్రాన్స్ వగైరా అభివృద్ధి చెందిన దేశాల్లో, బ్రెజిల్, నైజీరియా, ఇండోనేషియా, వియత్నాం వంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో పురుషుల కంటే స్త్రీలే ఎక్కువ ఉన్న పరిస్థితి ఉండగా మన దేశంలో ఈ నిష్పత్తి ఇలా దిగజారడం ఆందోళన కలిగించే విషయమే. ఆరేళ్ల లోపు పిల్లల విషయంలో ఈ నిష్పత్తి మరింత ఘోరంగా ఉంది. ప్రతి వేయిమంది బాలురకు 914 మంది మాత్రమే బాలికలున్నారు. అనగా కుటుంబ నియంత్రణ పద్ధతులు వ్యాప్తిలోకి వచ్చిన తర్వాత ప్రతి ఇంట్లో ఉండే పిల్లల సంఖ్య గణనీయంగా తగ్గింది నిజమే కాని ఆడపిల్లలు మాత్రమే అధికంగా తగ్గారన్నది ఇక్కడ చెప్పదల్చుకున్న విషయం.

దంపతులు ఆడపిల్లలు వద్దనుకోవడానికి కారణాలు అనేకం. హైటెక్ యుగంలో ప్రవేశించినా వరకట్న దురాచారం ఇంకా కొనసాగుతూనే వుంది. కూతురు పుడితే మరో ఇంటికి వెళుతుంది. కొడుకైతే వారసత్వం కొనసాగిస్తాడన్న మూఢవిశ్వాసం సమాజాన్ని ఇంకా వీడలేదు. ఇవన్నీ కలిసి ఆడ శిశువుల భ్రూణహత్యలకు పురికొల్పుతున్నాయి. 1980ల తర్వాత అమల్లోకి వచ్చిన లింగనిర్ధారణ పరీక్షలు, గర్భస్రావాల చట్టబద్ధత ఇందుకు తోడయ్యాయి. జన్యులోపాలతో శిశు జననాలను, అవాంఛిత గర్భాలను నివారించడానికి ఉనికిలోకి వచ్చిన ఈ పద్ధతులు ఆడపిల్లల పాలిట మృత్యుపాశాలుగా మారాయి. ఆడ శిశువుల భ్రూణహత్యలను ఆపడానికి వివిధ ప్రభుత్వాలు ఎన్ని చర్యలు చేపట్టినా ఫలితాలనివ్వడం లేదు. కుటుంబాల ఆర్థిక స్థితిగతులను మెరుగుపర్చితే, తల్లుల అక్షరాస్యతా స్థాయిని పెంచితే ఈ అకృత్యాలు ఆగిపోగలవని నిపుణులు భావిస్తుంటారు. ప్రభుత్వాలు కూడా ఇదే దారిలో ఆలోచించి పథకాలను ప్రవేశపెట్టాయి. కాని 2011 జనాభా లెక్కలు వీరి నమ్మకాన్ని పటాపంచలు చేశాయి. ధనిక రాష్ట్రాలుగా

# పంచాయతీలకు రాజ్యాంగ హోదా ఉంది : సుప్రీం

పంచాయితీలకు సొంతంగా ఆర్థికాభివృద్ధి, సామాజిక న్యాయ కార్యక్రమాలను రూపొందించుకోవచ్చని, వాటికి అందుకు తగ్గ రాజ్యాంగ హోదా ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దేశ రాజకీయ ప్రజాస్వామ్యానికి గ్రామ పంచాయతీ పునాదిగా ఉండాలని, అధికార వికేంద్రీకరణలో భాగంగా ఉండాలని, ప్రతి గ్రామ పంచాయితీ సొంత కార్యక్రమాలకు బాధ్యత తీసుకోవాలని రాజ్యాంగ నిర్మాతలు భావించారని పేర్కొంది. ఓ ప్రైవేటు కంపెనీకి వాణిజ్య కార్యకలాపాలకు అనుమతివ్వడాన్ని రద్దు చేస్తూ గోవాలోని కెలన్‌గూట్ పంచాయతీ తీర్మానం చేయగా దాన్ని పంచాయతీ–2 అదనపు సంచాలకుడు తిరస్కరించారు. అధికారి నిర్ణయాన్ని బాంబే హైకోర్టులో సవాల్ చేయగా అక్కడ పంచాయతీకి వ్యతిరేకంగా నిర్ణయం వెలువడింది. అధికార వ్యవస్థ తీసుకునే నిర్ణయాలను స్థానిక సంస్థ సవాల్ చేయజాలదని బాంబే హైకోర్టు తీర్పు చెప్పడంతో ఆ పంచాయతీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. విచారణకు స్వీకరించిన న్యాయమూర్తులు జస్టిస్ జి.ఎస్.సింఘ్వీ, జస్టిస్ ఎస్.జె.ముఖోపాధ్యాయతో కూడిన ధర్మాసనం స్పందిస్తూ "రాజ్యాంగ పీఠికలోని తొమ్మిదో భాగంలో పేర్కొన్న అంశాల ప్రకారం... పంచాయితీలు వాటి పరిధిలో అర్థికాభివృద్ధి, సామాజిక న్యాయానికి సొంతంగా కార్యక్రమాలను రూపొందించుకునే అధికారం ఉంది. ప్రభుత్వంలో మూడో అంచెలోకి వచ్చే పంచాయితీలకు వాటి పరిధిలోని ప్రజల ప్రయోజనాలను చూసుకోవాల్సిన బాధ్యత ఉంది." అని పేర్కొంది.

పెరుగాంచిన పంజాబ్, హర్యానా, గుజరాత్, మహారాష్ట్రల్లో బాలల లింగ నిష్పత్తి 1991–2011 మధ్యకాలంలో ఘోరంగా పడిపోయింది. ఈ రాష్ట్రాల్లో ప్రతి వేయి మంది బాలురకు 830 నుంచి 886 మంది బాలికలే ఉన్నారు. ఇక, తల్లుల విద్యాస్థాయిని చూస్తే నిరక్షరాస్యులైన తల్లులను కలిగిన కుటుంబాల్లో వేయి మంది బాలురకు 920 మంది బాలికలు ఉంటే, ప్రాథమిక విద్యనభ్యసించిన వారిలో 909 మంది, హైస్కూలు చదువు పూర్తి చేసిన వారిలో 885 మంది, డిగ్రీ ఆ పైన చదివిన తల్లుల్లో కేవలం 876 మంది బాలికలున్నారు.

జనాభా అదుపులో ఉండడం అభివృద్ధి చెందుతున్న దేశంగా భారత్‌కు అవసరమే కాని ఈ పేరుతో లింగవివక్ష, ఆడపిల్లల హత్యలు కొనసాగడం మాత్రం అసమంజసం. ప్రస్తుతం ధోరణి ఇలాగే కొనసాగితే సమీప భవిష్యత్తులో అబ్బాయిలు పెళ్లి చేసుకుందామంటే అమ్మాయిలు దొరక్కపోవచ్చు. ఒక అంచనా ప్రకారం మరో 20 ఏళ్లలో దేశంలో కోటి 20 లక్షల మంది అబ్బాయిలకు జోడీ దొరక్క బ్రహ్మచారులుగా ఉండిపోవాల్సి వస్తుంది. జనాభాను అదుపులో పెట్టే చర్యలను కఠినంగా అమలు చేసిన చైనా సైతం ఇలాంటి పరిస్థితినే తీవ్రంగా ఎదుర్కొంటున్నది. కనుక భారత ప్రభుత్వం వెంటనే మేల్కొనాలి. 2011 జనాభాల లెక్కల వివరాలను విశ్లేషించి లింగవివక్షను మదింపు చేయడానికి ఓ నిపుణుల కమిటీని నియమించాలి. ఆడపిల్లల పట్ల వివక్షను నిర్మూలించడానికి తగిన సామాజిక, ఆర్థిక సాంస్కృతిక మార్గాలను అన్వేషించాలి. ఏ రూపంలోనైనా వరకట్నం తీసుకోవడాన్ని నిషేధించాలి. లింగనిర్ధారణ పరీక్షలకు, గర్భస్రావాలకు సంబంధించిన నిబంధనలను కఠినతరం చేయాలి. శిక్షలు పెంచాలి. అన్ని రంగాల్లో అబ్బాయిలతో సమానంగా అమ్మాయిలకు సమాన హక్కులు కల్పించాలి. తల్లిదండ్రుల ఆస్తిలో వారు సమవాటా పొందేలా చట్టాలను ఖచ్చితంగా అమలు చేయాలి.

జనాభాలో భాగమైన ప్రతి వ్యక్తీ దేశాభివృద్ధికి కీలకమనుకున్నప్పుడే అది నాగరిక సమాజమని పించుకుంటుంది. భారతదేశం పేదల దేశమే తప్ప పేదదేశం కాదన్న ఆర్థిక శాస్త్రవేత్తల వక్కాణింపును ఇక్కడ పరిగణనలోకి తీసుకోవాలి. ఇప్పటి జనాభాకు మించిన జనసంఖ్యకు సర్వం సమకూర్చగల వనరులు దేశంలో పుష్కలంగా ఉన్నాయి. జనాభా పెరుగుదలనే అన్ని సమస్యలకు కారణమనే విధానం సరికాదు. మానవ శక్తులే సకల ఉత్పత్తికి, అభివృద్ధికీ మూలమనే మౌలిక విషయాన్ని గుర్తించాలి. కేవలం జనాభా పెరుగుదలను అరికట్టడమన్న కోణంలోనే ఆలోచించకుండా పౌరులందరినీ ఉత్పత్తితో పాటు, అభివృద్ధి ఫలాల పంపకంలో సమ భాగస్వాములను చేసే విధానాలు అమలులోకి తేవాలి. విదేశీ కంపెనీల దోపిడీని అరికట్టి స్వదేశీ ఉత్పత్తి విధాన మనుగడను కాపాడాలి. అప్పుడు ప్రజలే చైతన్యవంతులై స్వచ్ఛందంగా కుటుంబనియంత్రణ పద్ధతులను అవలంభిస్తారు. అభివృద్ధి, ఆరోగ్యకర సమాజానికి పునాదులు వేసి, దేశాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తారు. ◆(నమస్తే తెలంగాణ సౌజన్యంతో...)

# ప్రముఖుల పరమవుతున్న సబ్సిడీ సిలిండర్లు

వంట గ్యాస్ కోసం ఇస్తున్న రాయితీల భారం మోయలేనంతగా పెరిగిపోతోందని కేంద్ర ప్రభుత్వం సందర్భంగా వచ్చినప్పుడల్లా వాపోతోంది. సర్కారుకు వస్తున్న ఆదాయాన్ని ఇలాంటి రాయితీలే మింగేస్తున్నాయని, దీనివల్ల ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేయలేకపోతున్నామని చెబుతోంది. రాయితీ వంట గ్యాస్ సిలిండర్లను సామాన్యులకు అవసరమైన మేరకు సరఫరా చేయలేకపోతున్నారు. సిలిండర్లు సకాలంలో అందక జనం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే ప్రభుత్వ పెద్దలు, అత్యంత ప్రముఖులు మాత్రం ఇలాంటి సబ్సిడీ గ్యాస్ సిలిండర్లను విచ్చలవిడిగా వాడేస్తున్నారు. ధనవంతులు కూడా సర్కారు రాయితీని అనుభవిస్తున్నారు. కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి జైపాల్‌రెడ్డి ప్రారంభించిన ఎల్పీజీ పోర్టల్‌లో ఈవిషయం వెల్లడైంది. ఉపరాష్ట్రపతి హమీద్ అన్సారీ అధికారిక నివాసంలో ఏడాది కాలంలో 171 సబ్సిడీ వంట గ్యాస్ సిలిండర్లను ఉపయోగించారు. విదేశాంగశాఖ సహాయమంత్రి ప్రణీత్‌కౌర్ ఇంట్లో 161 సిలిండర్లు వాడారు. ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి విజయ్ బహుగుణ 83 సిలిండర్లను ఉపయోగించారు. భాజపా అగ్రనేత రాజ్‌నాథ్‌సింగ్ 80, కేంద్ర మాజీ మంత్రి ఎం.ఎస్.గిల్ 79 సిలిండర్లను వాడారు. సంపన్న పారిశ్రామికవేత్త, నవీన్ జిందాల్ ఇంట్లో ఒక సంవత్సరంలో 369 సిలిండర్లను ఉపయోగించారు. అంటే రోజుకు ఒకటి కంటే ఎక్కువే. సామాన్య ప్రజానీకం ఒక సిలిండర్ పొందిన తర్వాత మరొకటి తీసుకొనేందుకు 21 రోజుల వ్యవధి తప్పనిసరి. కానీ ప్రముఖులకు కోరుకున్నన్ని సిలిండర్లు వారి ఇళ్లకు చేరుతున్నాయి.

**అవీ... ఇవీ...**

దేశ రాజధాని ఢిల్లీలో సబ్సిడీ సిలిండర్లను ఎక్కువగా ఉపయోగిస్తున్న మొదటి 100 మందిలో అత్యధికంగా రాజకీయ నాయకులే ఉండడం గమనార్హం. మేనకా గాంధీ, సురేష్ కల్మాడీ, ములాయంసింగ్ యాదవ్, సయ్యద్ షానవాజ్ హుస్సేన్, అశోక్ గెహ్లాట్, లాలూ ప్రసాద్ యాదవ్, ఎ.రాజా తదితర ప్రముఖులు ఇందులో ఉన్నారు.

ప్రస్తుత నిబంధనల ప్రకారం... ఒక వినియోగదారుడు ఎన్ని సిలిండర్లు ఉపయోగించుకోవాలనే దానిపై ఎలాంటి పరిమితి లేదని కేంద్ర పెట్రోలియం శాఖ వెల్లడించింది. సబ్సిడీ సిలిండర్ల సరఫరాకు పరిమితి విధించాలనే ప్రతిపాదన పరిశీలనలో ఉందని తెలిపింది. ప్రముఖుల ఉపయోగించిన సిలిండర్ల లెక్కలు పూర్తిగా సరైనవి కాకపోవచ్చని స్పష్టం చేసింది. ◆

# పట్టణీకరణకు పట్టం

పట్టణీకరణ అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో 2050 కల్లా దేశంలో నగరాల్లో జీవిస్తున్న వారి సంఖ్య 85 కోట్లకు చేరనుంది. ఈ మేరకు సీఐఐ, జోన్స్ ల్యాంగ్ లాసల్లే సంస్థల తాజా అధ్యయన నివేదిక స్పష్టం చేసింది. ఈ నివేదిక ప్రకారం బ్రిక్ దేశాలతో పోల్చితే భారత్‌లోనే అత్యధిక వేగంతో గతంలో ఎన్నడూ లేనంతగా పట్టణీకరణ వృద్ధి చెందుతోంది. 2011లో 28 శాతం మంది పట్టణాల్లో ఉండగా 2011కి ఈ శాతం 31కి చేరింది. ఐక్యరాజ్య సమితి అంచనాల ప్రకారం 2050కి దాదాపు 85 కోట్ల మంది ప్రజలు నగరాల్లో జీవిస్తారు. ఇది ప్రస్తుత అమెరికా, బ్రెజిల్, రష్యా, జపాన్, జర్మనీ జనాభాకు సమానం. ఈ పట్టణీకరణ వల్ల దేశంలో పెద్ద ఎత్తున ఆకాశహర్మ్యాలు వెలుస్తారు. చిన్న చిన్న పట్టణాలు సైతం ఫ్లైఓవర్లు, విస్తృతమైన రహదారులు, స్థిరాస్తి వ్యాపారవృద్ధితో రూపుమారిపోతాయి. స్థిరాస్తి మౌలికవసతుల కల్పన రంగాల్లో భారీగా ఉపాధి అవకాశాలు ఉంటాయి. ఇదే కాకుండా భారత్ జనాభా సరాసరి వయసు (చిన్నారుల నుంచి వృద్ధుల దాకా అందరి వయసునూ పరిగణనలోకి తీసుకొని లెక్కించే సరాసరి) కూడా తగ్గుతున్నట్లు ఈ నివేదిక పేర్కొంది. ఇది 2020కి 29కి చేరుతుందని వివరించింది. ఈ సమయంలో చైనా, అమెరికాల్లో సరాసరి వయసు 37, పశ్చిమ యూరప్‌లో 45, జపాన్‌లో 48కి చేరుతుంది. భారత్‌లో యువ జనాభా వల్ల ఉపాధి అవకాశాలు మెరుగవడంతో పాటు... వ్యయం కూడా పెరుగుతుందని.. వీటివల్ల పలు ఉత్పత్తి రంగాలు అభివృద్ధి చెందుతాయని వివరించింది. ◆

# పాత్రికేయులు సమాజ మార్పును కాంక్షించాలి

## సీనియర్ జర్నలిస్టు వి.హనుమంతరావుకు సన్మానం - అంతర్వీక్షణం పుస్తకావిష్కరణ

ప్రజల ఆర్థిక స్థితిగతులను ప్రతిబింబించేలా పాత్రికేయులు సమాజమార్పును కాంక్షించాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ, సోమాజీగూడ ప్రెస్‌క్లబ్, వయోధిక పాత్రికేయుల సంఘం సంయుక్తాధ్వర్యంలో సీనియర్ జర్నలిస్టు వి.హనుమంతరావు పాత్రికేయ జీవిత షష్టిపూర్తి మహోత్సవంనాడు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని నందమూరి తారక రామారావు కళామందిరంలో జరిగింది. వయోధిక పాత్రికేయుల సంఘం అధ్యక్షులు డాక్టర్ జిఎస్. వరదాచారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి లోక్‌సత్తాపార్టీ అధ్యక్షులు, కూకట్‌పల్లి శాసనసభ్యులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రజాశక్తి బుక్‌హౌస్ సంపాదకులు తెలకపల్లి రవి, ప్రజాశక్తి అసిస్టెంట్ ఎడిటర్ ఎమ్ కోటేశ్వరరావు, విశాలాంధ్ర మాజీ సంపారకులు సిహెచ్ రాఘవాచారి, ఆంధ్రభూమి సంపాదకులు ఎమ్.వి.ఆర్ శాస్త్రి, పదవ ఆర్థిక సంఘం సభ్యులు బిపిఆర్ విఠల్, తెలంగాణా పోరాటయోధుల సంఘం అధ్యక్షులు సిహెచ్. రాజేశ్వరరావు, విశాలాంధ్ర విజ్ఞాన సమితి అధ్యక్షులు చాడ వెంకటరెడ్డి, ప్రెస్ అకాడమీ అధ్యక్షులు సురేంద్ర, బిజెపి రాష్ట్ర శాఖ పూర్వ అధ్యక్షులు వి.రామారావు ఆర్థికరంగ విశ్లేషకులు బి.యర్రంరాజు, తమ్మారెడ్డి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పాత్రికేయరంగంలో వి.హనుమంతరావు చేసిన సేవల్ని వారు కొనియాడారు. ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్లను ప్రజలకు అర్థమయ్యే రీతిలో సరళమైన భాషలో విపులంగా రాయగల దిట్ట అని ప్రశంసించారు.

డా॥ జయప్రకాష్ నారాయణ్ ప్రసంగిస్తూ సమాజమార్పునకు ఎన్నికల వ్యవస్థను సంస్కరించాలని, గెలుపే లక్ష్యంగా రాజకీయపార్టీలు వ్యవహరించడం వల్ల ప్రజలు ఆశించిన స్థాయిలో అభివృద్ధి ఫలాలు అందట్లేదని, దీనిపై పాత్రికేయరంగం దృష్టిపెట్టాలని లోక్‌సత్తా అధ్యక్షులు జయప్రకాష్‌నారాయణ్ సూచించారు. పత్రికలు చదివితే ప్రపంచజ్ఞానం పెరగాలని, కానీ ప్రస్తుతం రాజకీయాలు తప్ప మరేమీ కనిపించట్లేదని సన్మాన గ్రహీత వి.హనుమంతరావు తన ప్రతిస్పందనలో ఆందోళన వ్యక్తం చేశారు. తుదిశ్వాస విడిచేవరకూ తాను వ్యాసాలు రాస్తూనే ఉంటానని చెప్పారు. కార్యక్రమ ప్రారంభంలో వక్తలు, శ్రేయోభిలాషులు హనుమంతరావు, ఆయన సతీమణి సరళను ఘనంగా సన్మానించారు. అనంతరం హనుమంతరావు రాసిన 'జర్నలిస్టు అంతర్వీక్షణం' పుస్తకాన్ని ఆంధ్రభూమి సంపాదకులు ఎమ్‌విఆర్ శాస్త్రి ఆవిష్కరించారు. వయోధిక పాత్రికేయుల సంఘం కార్యదర్శి కె.లక్ష్మణరావు ఆహ్వాన, వందన సమర్పణ చేశారు. ◆



## కొత్త పుస్తకాలు

**అంతర్వీక్షణం**

రచయిత :
**వి. హనుమంతరావు**

ప్రతులకు : **వెల : 50/-**

**వి. హనుమంతరావు**
సి.ఆర్. ఫౌండేషన్, కొండాపూర్,
హైదరాబాద్ - 500 084



# ప్రజలే కేంద్ర బిందువు కావాలి

- వి.హనుమంతరావు

ఒక గ్రీకు తత్వవేత్త పట్టపగలు దీపం పట్టుకొని వీధుల్లో తిరుగుతూండగా ఇదేమిటని అడిగితే సత్యంకోసం వెతుకుతున్నాని అన్నాడట. అలాగే కొద్ది దినాల క్రితం లక్ష్మణరేఖ గురించి జరిగే రౌండ్ టేబుల్ సమావేశానికి నేను ఆహ్వానం వచ్చినప్పటి నుంచి లక్ష్మణరేఖ కోసం ఎంత వెతికినా కనిపించ లేదు. ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమి, ఢిల్లీలో సెంటర్ మీడియాస్టడీస్ సంస్థలు హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సమావేశంలో చర్చనీయాంశానికి 'లక్ష్మణరేఖ అవసరమా' అని పేరుపెట్టారుగాని మనం లక్ష్మణరేఖ దాటామా అని అంటే వాస్తవానికి దగ్గరగా ఉండేది. ఎందుకంటే లక్ష్మణరేఖ అంటే చేయవలసినవి, చేయకూడనవి అని అనుకుంటే, అలాంటి లక్ష్మణరేఖను మూడు అధికార సంస్థలు ఎప్పుడో నిర్ణయించాయి. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ జర్నలిస్ట్స్ ఈ గీతను ఎప్పుడో గీసాయి. ఆ మూడింటిని ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ తెనిగించి పంచి పెట్టింది. మరి ప్రెస్ అకాడమీ ఇప్పుడు రేఖగీయటం అవసరమా, అవసరమైతే ఎవరు గీయాలి? ప్రభుత్వమా, జర్నలిస్టులా, ప్రజలా? అందుకే మనం లక్ష్మణరేఖ దాటామా అని జర్నలిస్టులు తమలోతామే ఆత్మావలోకనం చేసుకోవాలి.

చిన్నప్పుడు 'సత్యమే పలుకవలెను, అబద్ధమాడరాదు' అని చదువుకొన్నాం. ఇది ఎవరు గీసారు అని అడగం, అలాగే జర్నలిస్టులు కూడా ఏ విశ్వవిద్యాలయంలోనూ, ఎవరూ చెప్పకుండానే అనేక నీతి సూత్రాలను నిత్యసత్యాలుగా భావిస్తున్నారు. 'మనం' వాస్తవాలనే రిపోర్టు చేయాలి' 'వార్త పవిత్రమైనదే, వ్యాఖ్యకు స్వతంత్రం' అనే లక్ష్మణరేఖను మనకు మనమే నేర్చుకున్నాం. కాసేపు మనం జర్నలిస్టులమనే విషయాన్ని పక్కన పెడితే, మానవ మాత్రులుగా, పౌరులుగా మన నిత్యజీవితంలో ఎన్నో రకాల లక్ష్మణరేఖలు పాటిస్తున్నాం. ఎప్పుడూ సత్యమే పలాకాలి, అడ్డదారి తొక్కి సంపాదనకు పాల్పడరాదు- వంటి లక్ష్మణరేఖల్ని ఎవరోగీసి, దీనిని దాటవద్దు అని వేరే చెప్పాలా? అందుచేత లక్ష్మణరేఖ అవసరమా అనే దానికన్నా ఇప్పటికే గీసి ఉన్న లక్ష్మణరేఖను మనం పాటిస్తున్నామా- అని ప్రశ్నించుకొంటే పాటించడం లేదు- అని నిస్సందేహంగా చెప్పుకోవచ్చు. జర్నలిజం వృత్తిలో అర్ధశతాబ్దం పని చేసిన తర్వాత వెనక్కు తిరిగి చూసుకొంటే జర్నలిజంలో విలువలు నశించాయని విచారించాల్సిన పరిస్థితే ఉంది. మొత్తం సమాజంలోనే విలువలు నశిస్తున్నాయి. జర్నలిస్టులూ ఆ తానులో ముక్కలే, కాగా ఆ బురద జర్నలిస్టులకూ అంటుకొంటుంది అని వాదించే వారితో ఏకీభవించలేను. సమాజం పేరుతో మన బలహీనతలను మనం కప్పిపుచ్చుకోవడమే అవుతుంది. అలా కాకుండా అద్దంలో మన ముఖం ఒకసారి చూసుకొంటే బావుంటుంది.

ఒక వ్యక్తి ఒకతప్పు చేస్తే, వ్యక్తిగా ఆ ఫలితాన్ని అనుభవిస్తాడు; మహా అయితే అతని కుటుంబ సభ్యులు ఆ దుష్ఫలితాన్ని రుచిచూస్తారు. కాని జర్నలిస్టు తప్పురాస్తే, లక్షలాది పాఠకులు ప్రభావితులవుతారు, తప్పుగా అర్థం చేసుకొంటారు. వాస్తవం బలైపోతుంది.

### వార్త వేరు, వ్యాఖ్య వేరు

ఉదాహరణకు, పెనుకొండ ఉప ఎన్నిక విషయంలో రెండు పత్రికలు చదివితే రెండు పూర్తిగా విభిన్నమైన కథలు కనిపిస్తాయి. ఏది నిజం? ఇది వార్తల రిపోర్టింగ్ కాదు; వ్యాఖ్యల రిపోర్టింగ్ అవుతుంది. అందుకు కారాణం వార్తకు, వ్యాఖ్యకు మధ్య ఉండవలసిన లక్ష్మణరేఖను మనమే చేరిపేశాం. వాస్తవమేమిటో పెనుకొండ నియోజకవర్గ ప్రజలకు మాత్రమే తెలుసు. బయట ప్రజలకు పత్రికా యజమానులు తమ విధానాల్లో వడబోసిన వార్తలే చేరతాయి. అయితే కొంతమంది జర్నలిస్టులు ప్రభువును మించిన ప్రభుభక్తితో పనిచేసే వారు వారు లేకపోలేదు. రాజకీయ నాయకులకు, జర్నలిస్టులకు మధ్య ఉండవలసిన లక్ష్మణరేఖ చెరిగిపోయింది. అలా జరిగిందంటే అందుకు జర్నలిస్టులే పూర్తి బాధ్యత వహించాలి. రాజకీయ నాయకులకు పత్రికలతో చాలా అవసరం ఉంది. అందుకోసం జర్నలిస్టుల ప్రాపకం కావాలి. అందుకోసం ఏం చేయాలన్నా చేస్తాడు, ఫ్లాట్లు, స్కూటర్లు కార్లు మందుసీసాల ఏదీ కాదనర్హం. 50వ దశకంలో నేను ఢిల్లీలో విలేఖరిగా పనిచేస్తున్నాప్పుడు ఒక విదేశీ రాయబార కార్యాలయం ప్రతినెలా ఒక స్కాచ్ బాటిల్ తాను ఎంపిక చేసిన జర్నలిస్టుల ఇళ్లకు పంపేది. అందుకు ప్రతిఫలంగా ఆ కార్యాలయం ఏమీ అడిగేది కాదు. అలా నెల తర్వాత నెల గడచిన తర్వాత ఒక శుభముహూర్తాన ఆ రాయబారి కార్యాలయం తనను ఫలానా ప్రభుత్వ సమాచారం కావాలని చెప్పేది. సీసాలు సీసాలు పట్టించిన తర్వాత, ఆ సమాచారం సేకరించను అని చెప్పే ధైర్యం

ఎవరికుంటుంది? అందువల్ల లక్ష్మణరేఖను చెరిపివేసిన తర్వాత రాజకీయ నాయకుడికి దాస్యం చేయవలసిందే.

రాజకీయ నాయకులు ఊసరవెల్లిలా రంగులు మార్చేస్తుంటారు. పార్టీలు మార్చేస్తుంటారు. వారిలో అత్యధికులు చేయని పాపం లేదు. అధికార దుర్వినియోగం, డబ్బు సంపాదన, స్కాములు, సెక్స్ నేరాల్లో ఇరుక్కోవడం వంటివి సర్వసాధారణమై పోయాయి. ఏ రాజకీయ నాయకుడైనా వెనక్కు తిరిగి నువ్వుమాత్రం ఈ పాపాలు చేయలేదా అని తిరిగి ప్రశ్నిస్తే, లేదని ధైర్యంగా చెప్పగలిగే జర్నలిస్టులు ఎంతమంది ఉంటారు? జర్నలిస్టులు వస్తే ఎర్ర తివాచీలు పరిచే రోజులు మారాయి. పైగా జర్నలిస్టులను కొనివేయవచ్చుననే అభిప్రాయం ప్రవేశించింది. లక్ష్మణరేఖకు ఇవతల ఉన్నామో దాటామో అనేది మనకు మనమే ప్రశ్నించుకోవాలి.

మనకు ఇష్టం లేకపోయినా, రాసే వార్త అవాస్తవమైనా రాయవలసి వస్తుంది. అలా రాయకపోతే యజమానులు బయటకు పంపిస్తారు. అలా వ్రాయకపోతే పొట్ట గడవాలి కదా అని తమను తాము సమర్థించుకొనే వారున్నారు. ఇది అవాస్తవం కాదు; కాని పూర్తి సత్యం కూడా కాదు, బ్రిటిష్ సామ్రాజ్యవాదులను ధిక్కరించిన జర్నలిజం పితామహులు కోటం రాజు రామారావు, ఈశ్వరదత్, సి.వై. చింతామణి, చలపతిరావు ఆదర్శప్రాయులు. జర్నలిస్టులలో ఐక్యత ఉంటే, నిర్మాణం ఉంటే ఇటువంటి ఇబ్బందిని అధిగమించగలం. ఎమర్జెన్సీ సమయంలో సెన్సార్ విధించినా, విశ్వాసాలను, నమ్మకాలను, అటకెక్కించకుండా చెప్పదలచుకున్నదీ, వ్రాయదలచుకున్నదీ రచనా శిల్పం ఉపయోగించటం ద్వారా, ఇటు యాజమాన్యానికి, అటు సెన్సార్‌కు చిక్కిపోకుండా వ్రాయగలిగా. అలాగే ఇటీవల రాజీపడకుండా విశ్వాసాలకు అనుగుణంగా వ్రాస్తూ రాగా, నా వ్యాసాలు ప్రచురించవద్దని హుకుం అందుకున్న ఒక పత్రికా యాజమాన్యం నా వ్యాసాలను నిషేధించింది.. పర్యవసానం? మొన్నటి ఎన్నికల్లో ఆ హుకుం పంపినవారు నేల కరిచారు. లక్ష్మణరేఖను మనమే గీసుకోవాల్సిన పనిలేదు. వ్రాసే రాతలకు గణాంకాలు, తదితర అధికార ప్రకటనలనే ఉపయోగించి, మోపే నేరాన్ని ఖండించుకోవచ్చు. వాదన పకడ్బందీగా ఉండాలి.

'గ్రామీణ జర్నలిస్టులు వార్తలు పంపడానికి డబ్బు అడుగుతున్నారు; కొన్ని వార్తలను ప్రచురించకుండా ఉండడానికి డబ్బు గుంజుతున్నారు అనే విమర్శను ఎదుర్కోవాల్సి వస్తుంది. వారు అలా చేయకుండా ఉండాలంటే, ప్రచురణ కేంద్రాల్లో పని చేసే సీనియర్లు ఆదర్శప్రాయంగా ఉండాలి. కేరళలో మొదటి కమ్యూనిస్టు ప్రభుత్వం ఏర్పాటై ఒక సంవత్సరం గడిచిన తరువాత ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఇఎంఎస్ నంబూద్రిపాల్ హైదరాబాద్ వచ్చినప్పుడు మీరు లంచగొండితనం మీద కారాలు, మిరియాలు నూరుతారు కదా, మీ ప్రభుత్వం అరికట్టిందా అని విలేకరులు ప్రశ్నించారు. 'మేము ఆదర్శప్రాయంగా నిక్కచ్చిగా ఉండడం వలస కింద స్థాయి ఉద్యోగులు ఆలోచించడం ప్రారంభించారు. ఆ మేరకు లంచగొండితనం తగ్గింది' అని ఆయన జవాబిచ్చారు. జర్నలిజం ఉద్యమంలో నాయకులు దీని నుండి గుణపాఠం నేర్చుకోవాలి. లేకపోతే, గ్రామీణ జర్నలిస్టులే 'మమ్మల్ని అంటున్నారు. మీ సంగతేమిటి' అని ప్రశ్నిస్తే ఎంత మంది నిబ్బరంగా జవాబివ్వగలరు?

లక్ష్మణరేఖను ఎవరు గీయాలి, ఎక్కడ గీయాలి అనే ప్రశ్నలకు జవాబు చెప్పడానికి కష్టపడవలసిన అవసరం లేదు. ఆ రేఖను గీసుకొనే ధైర్యం జర్నలిస్టులకే ఉండాలి. గ్రామీణ జర్నలిస్టులు పూర్తి కాలం జర్నలిస్టులుగా పనిచేస్తున్నారు. కాబట్టి వారికి చట్టం ప్రకారం జీతాలిస్తే చాలు, ఆ దుర్నీతిని అరికట్టవచ్చు. యాజమాన్యాలు లాభాలు సంపాదించడానికే పత్రికల్ని ప్రచురిస్తున్నాయి. పత్రిక అమ్ముడుపోవాలంటే సర్క్యులేషన్ పెరగాలి. అందుకు పత్రికలో ఏ విషయాలు ప్రచురిస్తే ఎక్కువ లాభాలొస్తాయే చూసుకుంటాయి. పత్రికల మధ్య పోటీ అనివార్యం. మార్కెట్ ఎకానమీ అన్ని వ్యాపారాలను నిర్దేశిస్తోంది. పరస్పరం పోటీపడి చిన్న విషయాలను భూతద్దంలో చూపుతున్నారని పాలకులు బాధపడాల్సిన పని లేదు. ఒకవైపు మార్కెట్ ఎకానమీని ప్రోత్సహిస్తూ, మరోవైపు పోటీ పడవద్దంటే జరిగే పనికాదు.

రాజకీయాలు, రాజకీయనాయకులు కాదు, జర్నలిజానికి ప్రజలే కేంద్రబిందువుగా ఉండాలనేదే ప్రభుత్వం, యాజమాన్యాలు, జర్నలిస్టులకు విధించే నియమంగా ఉండాలి. ఆ మధ్య డి.ఎన్.ఎఫ్. మహిళా జర్నలిస్టు అవార్డు అందుకున్న నవోదయం పత్రిక సంపాదకురాలు మాట్లాడుతూ ఏడవతరగతితో, పదవతరగతితో చదువు చాలించి గృహిణిలుగా ఉన్న స్త్రీలు, తమ పత్రికలో పనిచేసి, ఓపెన్ యూనివర్సిటీలో చేరి విద్యార్హత పెంచుకోవచ్చునన్న వార్త చదివి కనీసం డబ్బైమందైనా ఆ కోర్సుల్లో చేరారని చెప్పారు. వార్త అంటే అలా ఉండాలి. ప్రజలకు, సమాజానికి ఉపయోగపడాలి. అదే లక్ష్యంగా జర్నలిస్టులు తమకు, ప్రజలకు మధ్య ఉన్న లక్ష్మణరేఖను చెరిపేసుకొని ప్రజలే ప్రతీ వార్తలో ప్రత్యక్షమయ్యే విధంగా వార్తలు రచించి, ప్రచురించాలి. తమ గురించి, తమ సమస్యల గురించి వార్తలు ప్రచురిస్తే ప్రజలు ఆదరిస్తారు; ఆయా పత్రికల సర్క్యులేషన్ పెరుగుతుంది; పత్రికా యజమానుల లక్ష్యం కూడా నెరవేరుతుంది. ◆

**(అంతర్వీక్షణం పుస్తకం నుండి)**

# రైతుల్ని ఆదుకునే విధానాల్లేవు

## కొత్త పుస్తకాలు

"ప్రస్తుతం రాజకీయ పార్టీలు, నేతలు రైతు సమస్యలను కీలక అంశంగా పరిగణించడం లేదు. రైతుల కోసం ధర్నాలు, హర్తాళ్లు చేసేవారు లేరు. వారికి అనుకూలంగా సరైన విధానాల్లేవు" అని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి అజిత్ సింగ్ అన్నారు. వ్యవసాయ శాఖ మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు గతంలో వివిధ పత్రికల్లో రాసిన వ్యాసాల సంకలన గ్రంథం- **దేశం కోసం రైతు...రైతు కోసం ఎవరు?** ను అజిత్‌సింగ్ జూబ్లీహాలులో ఆవిష్కరించారు. ఈ సభకు కేంద్రమంత్రి పురంధేశ్వరి, లోక్‌సత్తా అధినేత జయప్రకాష్‌నారాయణ్ హాజరవగా మాజీ ఎంపీ ఎలమంచిలి శివాజీ అధ్యక్షత వహించారు.

**అంతా ఓట్ల రాజకీయమే...**
**రైతన్నను పట్టించుకోరు..**

**అజిత్‌సింగ్** మాట్లాడుతూ రాజకీయ నాయకులకు ఇల్లు, కారు వంటివాటిపై ఆసక్తే తప్ప రైతుల సమస్యలపై శ్రద్ధ లేదన్నారు. ఎన్నికల్లో పోటీ చేయడం, ఓట్లు కొనుక్కోవడమే విధానంగా మారిందన్నారు. పోలింగ్ కేంద్రాలకు కులాలు, వర్గాల పేరుతో ఓట్లు వేయడానికి వెళుతున్నారే తప్ప రైతులమని చెప్పి ఓటు వేయడానికి వెళ్లడం లేదన్నారు. నేను వ్యవసాయమంత్రిగా ఉన్నప్పుడే స్వామినాథన్ కమిటీ ఏర్పాటు ప్రక్రియ మొదలైంది. ఆ కమిటీ నివేదిక అమలుకాలేదు. ఆ తరవాత హర్యానా ముఖ్యమంత్రి అధ్యక్షతన మరో కమిటీ వేశారు. దాని సిఫార్సులు అమలు కాలేదు... నేడు రైతు సమస్యలను అంతముఖ్యమైన అంశంగా నేతలు పరిగణించకపోవడమే ఇందుకు కారణం. అని అజిత్ సింగ్ విమర్శించారు. చిల్లర వ్యాపారంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు(ఎఫ్‌డిఐ) అనుమతించాలంటే తొలుత రైతులకు రక్షణ కల్పించేలా ఆ ఒప్పందాలు రూపొందాలన్నారు.

మరో మంత్రి **పురంధేశ్వరి** ప్రసంగిస్తూ రైతుల సమస్యలపై ఎన్నో సార్లు వివిధ శాఖల మంత్రులు, అధికారుల వద్దకు తాను వెళ్లినప్పుడు ఒక విషయం అర్థమైందన్నారు. క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను తెలుసుకోకుండా ఏసీ గదుల్లో కూర్చుని బ్యూరోక్రాట్లు, మంత్రులు పాలనా విధానాలను రూపొందిస్తున్నారని, దీనివల్లే వ్యవసాయంలో సమస్యలు తీరడం లేదని చెప్పారు. ఎగుమతులకు తలుపులు తెరిస్తే ఆహారధాన్యాల కొరత



"దేశం కోసం రైతు... రైతు కోసం ఎవరు?" పుస్తకాన్ని ఆవిష్కరణ చేసిన కేంద్ర మంత్రి అజిత్‌సింగ్, కేంద్ర సహాయ మంత్రి పురందేశ్వరి, డా॥ జయప్రకాష్ నారాయణ్, వడ్డే శోభనాద్రీశ్వరరావు, శివాజీ తదితరులు

ఏర్పడుతుందని ఢిల్లీలో భయపడుతుంటారని, తీరా రైతులు అమ్మేశాక ఎగుమతులకు అనుమతిస్తున్నారని, దీనివల్ల వ్యాపారులకే లాభం అని తెలిపారు.

**జయప్రకాష్‌నారాయణ్** ప్రసంగిస్తూ రైతుల సమస్యల పట్ల


**దేశం కోసం రైతు**
**రైతు కోసం ఎవరు?**

రచయిత :
**వడ్డే శోభనాద్రీశ్వర రావు**




**ప్రతులకు :**
**వి.వి.ఎ. ప్రసాద్**
ఇం.నం. 2-48, శివాలయం వీధి
వుయ్యూరు - 521 165, కృష్ణా జిల్లా

**వెల : 200/-**

ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. పక్క రాష్ట్రాలకు ధాన్యం ఎగుమతులను నిషేధించడం ద్వారా సర్కారే గూండాలా, వీధి రౌడీలా రైతులను దెబ్బతీసిందన్నారు. ఈ నిషేధం వల్ల ధాన్యానికి ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోయారని, దీన్ని వ్యతిరేకిస్తూ తాము పాదయాత్ర చేసి అరెస్టు అయ్యామని గుర్తుచేశారు. ఎవరి లబ్ధి కోసమో రైతులను దెబ్బతీసేలా విధానాలు ఉండటం సరికాదన్నారు. రైతుల సమస్యలకు పరిష్కారం చూపాల్సిన ప్రభుత్వమే... వారికి సమస్యలా మారిందని జయప్రకాష్ ధ్వజమెత్తారు. రాజకీయాలపై ఆయన మాట్లాడుతూ ప్రతీదానికి ఇప్పుడు ఎమ్మెల్యే కేంద్రంగా మారడంతో 'ఎమ్మెల్యే రాజ్యం' అన్నట్లుగా పరిస్థితులు మారి, రాజకీయ వ్యవస్థ నాశనం ఆవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. **యలమంచిలి శివాజీ** మాట్లాడుతూ ఆచార్య ఎన్జీ రంగా, చరణ్ సింగ్‌లు 1930 నుంచి రైతుల కోసం పోరాడిన తీరును వివరించారు. రైతుల కోసం నెహ్రూను సైతం రంగాను ఎదిరించారని, ఈ రోజుల్లో అలాంటి నేతలు ఎక్కడని అన్నారు. **వడ్డే శోభనాద్రీశ్వరరావు** మాట్లాడుతూ తాను రంగా, చరణ్‌సింగ్‌ల నుంచి ఎంతో స్ఫూర్తిని పొంది రైతుల కోసం శ్రమించామన్నారు.

## సన్మానాలు

ఈ సందర్భంగా వ్యవసాయంలో అవిరళ కృషి జరిపిన పలువురు శాస్త్రవేత్తలు, రైతు సంఘాల నేతలు, పాత్రికేయులను శాలువాలు, జ్ఞాపికలతో సన్మానించారు. 'అన్నదాత మాసపత్రిక' **ఎడిటర్ వాసిరెడ్డి నారాయణరావు, ఎస్.లక్ష్మీరెడ్డి, అల్లాస్ జానయ్య, యు.శ్రీదేవి, వై.వెంకటేశ్వరరావు, ఓలేటీ గోపినాథ్, ఎంజే ఖాన్, కొల్లి నాగేశ్వరరావు, చెంగల్ రెడ్డి, ఎం.పద్మనాభరావు, నల్లమల వేంకటేశ్వరరావు, పంతులు, సారంపల్లి మాల్లారెడ్డి, మాగంటి సీతారామస్వామి, రంగారావు, ఎర్నేని నాగేంద్రనాథ్, డాక్టర్ ఎన్.ఎన్.రావు, డి.సత్యనారాయణరెడ్డి, ఎ.ప్రసాదరెడ్డి, వై.యోగేశ్వరరావు, చిన్నం శ్రీనివాసరావు, శ్యాంప్రసాదరెడ్డి, బి.వెంకట్రావు** తదితరులు సన్మానగ్రహీతలలో ఉన్నారు. ◆

## స్వీకారం

లోక్‌సత్తా టైమ్స్‌లో పుస్తక సమీక్షల కోసం రెండు పుస్తకాలను పంపించవలసిందిగా ప్రచురణకర్తలకు విజ్ఞప్తి చేస్తున్నాం.










**ప్రతులకు :**
నేషనల్ బుక్ ట్రస్ట్, ఇండియా
నెహ్రూ భవన్, 5, ఇన్‌స్టిట్యూషనల్ ఏరియా, ఫేజ్ - II
వసంత్ కుంజ్, న్యూ ఢిల్లీ-110 070

**ప్రతులకు :**
**విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్**
**4-1-435, విజ్ఞాన్ భవన్,**
**అబిడ్స్, హైదరాబాద్ -001**

# భాగ్యనగరానికి శాపంగా డ్రైనేజీ వ్యవస్థ

- యల్.వి. రామరాజు

సెప్టంబర్ 28, 1908 సంవత్సరంలో మూసీనదికి వచ్చిన వరదల గురించి తెలిసిన వారు ఇప్పుడు ఉండకపోవచ్చు. కానీ 2000 సంవత్సరం ఆగష్టు 24తేదీన వచ్చిన వరదల గురించి మన పాలకులు మరిచినా సామాన్య జనం మాత్రం వర్షం పడితే అలనాటి కష్టాలు మరచి పోలేకున్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి తలెత్తితే హైదరాబాద్ నగరం తట్టుకునే పరిస్థితిలో ఉందా అని మన నగరపాలక సంస్థ పాలకవర్గం ఆలోచించవలసి ఉంటుంది.

20వ శతాబ్దంలో మూసీనదికి వచ్చిన వరదలకు స్పందించిన ఆనాటినైజాం నవాబు శ్రీమీర్ ఉస్మాన్ ఆలీ ఖాన్ హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ చెరువులు నిర్మించి, మూసీనది వరదల నరికట్టడంతో పాటు హైదరాబాద్ నగర మంచినీటి అవసరాలు తీర్చడం జరిగింది. అదే ప్రస్తుత ప్రభుత్వ పెద్దలు 2000 సంవత్సరం వరదలనంతరరం కిర్లోస్కర్ కమిటీ వేయడం, వారి నుంచి నివేదిక స్వీకరించడం వరకు మాత్రమే చేశారు. కమిటీ ఇచ్చిన సూచనలు అమలు చేయడంలో చిత్తశుద్ధి లోపించింది.

1908 సంవత్సరం మూసీనదికి వచ్చిన వరదల సమయంలో ఒక్కరోజులో 43 సె.మీ. వర్షపాతం నమోదు కాగా ప్రాణ, ఆస్తినష్టం భారీగా జరిగింది. 2000 సంవత్సరం 24 సె.మీ. వర్షం కురవగా అదృష్టవశాత్తు ప్రాణనష్టం తక్కువ, ఆస్తినష్టం ఎక్కువ జరిగింది. వరదలనంతరం ప్రభుత్వం వేసిన కిర్లోస్కర్ కమిటీ మరియు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, హైదరాబాద్ శాఖకు చెందిన డా॥సర్వోత్తమన్ మరియు యు.యన్.సత్పతి గార్లు 1964 నుండి 1998 సంవత్సరం వరకు హైదరాబాద్ నగరానికి సంబందించిన ఉపగ్రహ చిత్రాల ఆధారంగా వరదలు నివారించడానికి తీసుకొనవసిన చర్యలు, భవిష్యత్తులో నగర అభివృద్ధికి ప్రణాళికలు రచించే సమయంలో తీసుకోవలసిన





ముందుజాగ్రత్త చర్యలు సూచిస్తూ నివేదిక తయారుచేయడం జరిగింది.



**కిర్లోస్కర్ కమిటీ, జి.ఎస్.ఇ. శాస్త్రవేత్త సూచనలు - ప్రస్తుత పరిస్థితి**

- 170కి.మీ మేర వరనీటి కాలవలు వెడల్పు చేసి రక్షణగోడలు నిర్మించడం అలాగే నాలాలపై ఆక్రమణలను పూర్తిగా తొలగించడం మరియు పూడికలు తీయడం వంటి చర్యలు చూచించారు. కానీ దశాద్ధ కాలం గడచినా నాలాలు వెడల్పు రక్షణ గోడలు నిర్మించడం 25 శాతం మాత్రమే పూర్తికావడం జరిగింది. నాలాల ఆక్రమణల సంఖ్య ఆనాడు 1500 ఉండగా ఇప్పుడు ఆ సంఖ్య తగ్గకపోగా మూడు రెట్లు పెరిగింది.
- కూకట్ పల్లి, పికెట్ నాలాల ద్వారా వరదనీరు హుస్సేన్ సాగర్‌కు తదుపరి దిగువకు వదిలిన నీరు మూసీనదికి చేరాలి. వరదల సమయంలో హుస్సేన్ సాగర్ నుండి గరిష్టంగా 40,000 క్యూసెక్కుల నీరు వదలవసి ఉండగా ప్రస్తుతం 16,000 క్యూసెక్కులు వదిలే పరిస్థితి ఉంది.
- 1964 సం॥ చిత్రాల ప్రకారం వరదనీటి కాలువలు ఉన్న ప్రదేశాలలో ఇప్పుడు పలు నివాసప్రాంతాలు వెలిశాయి. ఉదాహరణకు బర్కత్‌పూర్, నల్లకుంట లాంటి ప్రాంతాలు, ప్రకృతి సహజంగా ఏర్పడిన కాలువలను అడ్డుకొని ఇండ్లు నిర్మించడం కూడా వరదలు రావడానికి ముఖ్య కారణం. భవిష్యత్తులో కొత్త ప్రాంతాలలో ఇలాంటి పరిస్థితి రాకుండా నగరపాలక సంస్థ మరియు హెచ్.యం.డి.ఎ. చర్యలు తీసుకోవలసి ఉంటుంది. – గతంలో హైదరాబాద్ నగరం మరియు శివారు ప్రాంతాలతో కలిపి 400 వరకు చెరువులు, కుంటలు ఉండేవి. ప్రస్తుతం 169 మాత్రమే చిక్కిశల్యమై ఉన్నవి. చెరువులను పూడ్చి నివాస ప్రాంతాలు ఏర్పాటు కావడం కూడా వరదలకు కారణమవుతోంది. ఉదాహరణకు మాసబ్ టాంక్, విజయనగర్ కాలనీ, సరూర్‌నగర్ లాంటి ప్రాంతాలతో పాటు శివారు ప్రాంతాలలో చెరువులు విపరీతంగా ఆక్రమణలకు గురవతున్నవి. ఈ ఆక్రమణలకు ముఖ్య కారణం వివిధ శాఖల మధ్య సమన్వయ లోపం ముఖ్యంగా ఇరిగేషన్, రెవిన్యూ మరియు నగరపాలక సంస్థలు. ఇప్పటికైనా పాలకులు కళ్ళుతెరిచి చెరువుల రక్షణకు ఏర్పాట్లు చేసి భవిష్యత్తులో ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకోవడం ద్వారా ప్రకృతి విపత్తుల నుండి భావి తరాలను రక్షించాలి. 2010 ఏప్రిల్ మాసంలో అట్టహాసంగా ప్రారంభించిన చెరువుల పరిరక్షణ కమిటీ మార్చి 2012 నాటికి 5 సమావేశాలు నిర్వహించినా తీసుకున్న చర్యలు క్షేత్రస్థాయిలో శూన్యం.
- ప్రతి సంవత్సరం వర్షాలు ప్రారంభం కావడానికి ముందే వరదనీటి కాలువలు పూడిక తీస్తున్నట్లైతే వర్షపునీరు రోడ్లపైన, ఇళ్లలోకి వచ్చే అవకాశం ఉండదు. కానీ వాస్తవ పరిస్థితులు భిన్నంగా ఉంటున్నవి. 2010–11 ఆర్థిక సంవత్సరంలో కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలో లోక్‌సత్తా పార్టీ కార్యకర్తలు జరిపిన పరిశీలనలో, అధికారులు మరియు కాంట్రాక్టర్ల అవగాహనతో తూతూమంత్రంగా పనులు పూర్తిచేసి నిధులు దుర్వినియోగం చేసినట్లు వెల్లడైంది.
- ప్రజలు కూడా తమవంతు పాత్రగా వరదనీటి కాలువలలో ఇసుక, ఇటుకల లాంటి నిర్మాణ సామగ్రి ప్లాస్టిక్ సంచులు, సీసాలలాంటి వ్యర్థ పదర్థాలు వేస్తున్నారు. వీటిని అరికట్టడానికి నగరపాలక సంస్థ కఠినమైన చర్యలు తీసుకోవలసి ఉంటుంది.

ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు మరియు ప్రజాప్రతినిధులు కళ్ళు తెరిచి నగర ప్రజలను చిన్న వర్షాలకే నదులను తలిపించే రోడ్లు, చెరువులను తలపించే కాలనీల పరిస్థితి నుండి మరియు వర్షాకాలం వచ్చిందంటే కళ్ళమీద కునుకు రాని బస్తీవాసులను కష్టాల నుండి రక్షించాలని భాగ్యనగర ప్రజలు ఆశించడంలో తప్పులేదు. ◆

# అభివృద్ధిపథంలో కూకట్‌పల్లి నియోజకవర్గం

## ఫతేనగర్‌లో మూడేళ్ళ ప్రగతి

1. ఎంతోకాలం నుంచి పెండింగ్‌లో ఉన్న ఫ్లైఓవర్ ఇందిరాగాంధీపురం నుంచి బేగంపేట శామ్‌లాల్ బిల్డింగ్ వరకు 22 కోట్లతో పూర్తికావస్తుంది.
2. ఎంతోకాలం నుంచి బల్కంపేట నుంచి బేగంపేట వరకు ఉన్న ఫ్లైఓవర్ మరియు ఆర్‌యుబి 29 కోట్లతో పూర్తి కావస్తున్నది.
3. మంచినీటిలో మురుగునీరు కలవకుండా ఉండేందుకు ఎమ్మెల్యే నిధులు 45 లక్షలతో పైప్‌లైన్ పనులు చేపట్టారు.
4. 300 సోడియం వ్యాపర్ ల్యాంప్స్‌ని ఏర్పాటు చేయడం జరిగింది.
5. హెచ్‌పి రోడ్డు నుండి జింకలవాడ, సమతానగర్ వెళ్ళటానికి బ్రిడ్జి నిర్మించడం జరిగింది.
6. చేపల మార్కెట్ దగ్గర నుండి ఫతేనగర్ నాలా వరకు నాలా వెడల్పు చేయడం కోసం 16 కోట్ల నిధులు మంజూరు చేయడం జరిగింది.
7. చేపల మార్కెట్ దగ్గర నుండి ఆర్‌టిసి బస్ డిపో వరకు మరియు కెమికల్ నాలాను వెడల్పు చేయడానికి 16 కోట్లు నిధులను మంజూరు చేయడం జరిగింది.
8. దీన్‌దయాల్ నగర్ బ్రిడ్జిని 4.16 కోట్లతో జిహెచ్‌యమ్‌సిలో మంజూరు చేయడం జరిగింది. అదేవిధంగా కైతాన్ ఫ్యాక్టరీ దగ్గర 4.16 కోట్లతో ప్రపోజల్స్ ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి.
9. 90 కోట్లతో బాలానగర్ ఫ్లైఓవర్ మంజూరైంది
10. ఫతేనగర్ నుంచి గౌతమ్ నగర్ కలిపేందుకు 80 లక్షలతో బ్రిడ్జిని మంజూరు చేయడం జరిగింది.
11. నేతాజీనగర్, భగత్‌సింగ్ పార్క్, తెనుగు బస్తీలలో 60 లక్షలతో కమ్యూనిటీ హాల్స్ నిర్మించడం జరిగింది. దీన్‌దయాల్‌నగర్‌లో 15 లక్షలు ఎమ్మెల్యే ఫండ్స్‌తో కమ్యూనిటీ హాలు మంజూరు చేయడం జరిగింది.
12. 7 కోట్లతో రోడ్లు, డ్రైనేజీ, వరద కాలువలు మరియు ఇతర పనులు పూర్తి చేయడం జరిగింది. అదేవిధంగా 25.21 లక్షలు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు మంజూరు చేయడం జరిగింది.
13. యల్.బి. శాస్త్రి నగర్ మరియు శివశంకర్ నగర్‌లో ప్రజలకు ఇబ్బందిగా ఉన్న మరుగుదొడ్లను తొలగించి కమ్యూనిటీ హాల్స్‌ని ఏర్పాటు చేయడం జరుగుతుంది. పార్థివ బస్తీలో మరుగుదొడ్లు నిర్మించడం జరిగింది.
14. 50 లక్షలతో సుమారు 15 బోర్‌వెల్స్ మరియు మున్సిపల్ వాటర్ పనులు చేయడం జరిగింది.
15. గౌతమ్‌నగర్‌లో హిందూ శ్మశాన వాటిక, ముస్లిం శ్మశాన వాటిక, హెచ్.పి. రోడ్డులో శ్మశాన వాటిక, మరియు వాల్మీకి నగర్‌లో శ్మశాన వాటిక అభివృద్ధి పనులకు 60 లక్షల నిధులను మంజూరు చేయడం జరిగింది.

## మూసాపేటలో మూడేళ్ళ ప్రగతి

1. 2007 నుంచి పెండింగ్‌లో ఉన్న మూసాపేటలో వాటర్ పైప్‌లైన్ 75 లక్షలతో పూర్తిచేయడం జరిగింది. 40 లక్షలతో వాటర్ సంపు పనులను చేపట్టారు.
2. 13 కోట్లతో ఐడిపియల్ దగ్గర సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ పూర్తి కావస్తుంది. దీనివలన బాలాజీనగర్‌లో డ్రైనేజీ సమస్య పరిష్కారం కావడమేకాకుండా చెరువులో మురుగునీరు శుభ్రం చేయబడుతుంది.
3. 13 కోట్లతో ఐడిపియల్ చెరువు దగ్గర నుంచి కైతలాపూరు వరకు రోడ్డు పనులు పూర్తికావడం జరిగింది.
4. మలేషియన్ టౌన్‌షిప్ జంక్షన్ నుంచి మూసాపేట జంక్షన్ వరకు 30 కోట్లతో రోడ్డు వెడల్పు పనులు జరుగుతున్నవి.
5. మూసాపేట – మలేషియన్ టౌన్‌షిప్ దగ్గరి నుంచి మాదాపూర్ మెయిన్ రోడ్డు (అమరావతి హోటల్ వరకు 25 కోట్లతో రోడ్డు పనులు జరుగుతున్నవి.)
6. 40 లక్షల ఎమ్మెల్యే నిధుల ఖర్చుతో మంచినీరులో మురుగునీరు కలవకుండా ఉండడానికి పైప్‌లైన్ పనులు

చేయడం జరిగింది.

7. 275 సోడియం వ్యాపర్ ల్యాంప్స్ ఏర్పాటు చేయడం జరిగింది.
8. 60 లక్షలతో 6 కమ్యూనిటీ హాల్స్ నిర్మించడం జరిగింది.
9. లోక్‌సత్తా సహకారంతో క్రితి యన్‌జిఓ ద్వారా తక్కువ ఖర్చుతో వైద్యసేవలు అందించడం జరిగింది.
10. బాలాజీ నగర్‌లో 42 లక్షలతో రెండు పార్కులు అభివృద్ధి చేయడం జరిగింది .
11. 5.35 కోట్లతో రోడ్డు పనులు పూర్తిచేయడం జరిగింది.
12. డ్రైనేజీ, వరద కాలువల పనులు 4.05 కోట్లతో పూర్తి చేయడం జరిగింది.
13. బెల్టుషాపులను స్థానికుల సహకారంతో కొంతవరకు అరికట్టడం జరిగింది.
14. జిహెచ్ఎంసి మరియు మెట్రో సహాయంతో మూసాపేటలోని లోతట్టు ప్రాంతాలు ముంపుకి గురికాకుండా ఉండే ఏర్పాటు చేయడం జరిగింది.
15. 2.5 కోట్లతో చెరువుల పరిరక్షణకి నిధులు మంజూరు చేయడం జరిగింది.
16. 44 లక్షలతో 4 శ్మశానవాటికలను అభివృద్ధి చేయడానికి నిధులు మంజూరయ్యాయి.
17. 256 మందికి రాజీవ్ గృహకల్పలో ఇళ్ళు ఇప్పించడం జరిగింది.
18. 12 బోర్ వెల్స్ మరియు బోర్ వెల్స్ పనులను సుమారు కోటి రూపాలతో చేపట్టడం జరిగింది.
19. చెత్త డంప్‌యార్డ్‌కు 4 ఎకరాల స్థలాన్ని కేటాయించడం జరిగింది.
20. 4 కోట్లతో 33 కేవి సబ్‌స్టేషన్ పనులు జరుగుతున్నాయి. అదేవిధంగా 50 లక్షలతో 11కేవి ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడం జరిగింది.

సేకరణ : **బొంతు సాంబిరెడ్డి**

# లోక్‌సత్తా పార్టీ జిల్లాల్లో కార్యక్రమాలు

## నల్లగొండ జిల్లా...గరిడేపల్లి

### పలకలు, పుస్తకాలు పంపిణీ

మండలంలోని వెలిదండ, రంగాపురం, కొత్తగూడెం ప్రభుత్వ పాఠశాలల్లోని 150 మంది విద్యార్థులకు కడియం రాంరెడ్డి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆయన కుమారుడు కడియం శ్రీనివాస్‌రెడ్డి -పద్మ దంపతులు ఉచితంగా పలకలు, నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏటా తమ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శిరీష, కెవి సత్యనారాయణ మౌలాలి, రామారావు, సతీష్, నర్సింహారావు, కిరణ్, కడియం వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గుంటూరు జిల్లా... చిలకలూరిపేట

### చంద్రబాబు సీసాలో కిరణ్ సారా

మద్యం విధానం అవలంబనలో కిరణ్‌కుమార్ సర్కార్ చంద్రబాబు నాయుడును అనుసరిస్తూ బాబు సీసాలో కిరణ్ సారాలా వ్యవహరిస్తుందని లోక్‌సత్తా పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాదాసు భానుప్రసాద్ ఎద్దేవా చేశారు. మద్యం టెండర్లలో లాటరీ విధానాన్ని వ్యతిరేకిస్తూ ఆ పార్టీ ఏరియా సమితి ఆధ్వర్యంలో స్థానిక ఎక్సైజ్‌శాఖ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిరణ్ సర్కార్ మద్యం వ్యాపారాన్ని ప్రైవేటర్ల పరం చేసి కొత్త పాలసీ అంటూ పాత విధానాన్నే అనుసరించి రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చారంటూ ధ్వజమెత్తారు. మద్యం సుంకం ద్వారా రాష్ట్రానికి రూ.22.000 కోట్ల ఆదాయం లభిస్తుందని దాని కారణంగానే మద్యాన్ని ప్రైవేట్‌పరం చేసి దోపిడీకి పాల్పడేందుకు ప్రభుత్వం సమాయత్తమైందని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో నేరాలు, ఘోరాలు, రోడ్డు ప్రమాదాలు, మహిళలపై వేధింపులు పెరగడానికి మద్యం ఒక ప్రధాన కారణమని తెలిసి కూడా ప్రభుత్వం దాన్ని ప్రోత్సహిస్తూ ఆదాయమే పరమావధిగా భావించి ప్రజల సంక్షేమాన్ని గాలికి వదిలేస్తుందని విమర్శించారు. ప్రభుత్వమే మద్యం దుకాణాలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం ఎక్సైజ్

## లోక్‌సత్తా పార్టీ జిల్లాల్లో కార్యక్రమాలు

శాఖాధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు షేక్ జబ్బార్, కార్యదర్శి మురికిపూడి ప్రసాద్, పి. చంద్రమౌళి, కిరణ్ సింగ్, నాగరాజు, శ్రీనివాసరావు, మేస్త్రీ, ఖాదర్, సిద్దిక్, సాధిక్, పి. హనుమంతరావు, ఎన్ వీరయ్య తదితరులున్నారు.

## వరంగల్ జిల్లా... వర్ధన్నపేట

### 'ధన రాజకీయాలకు స్వస్తి పలుకుదాం'

ధన రాజకీయాలకు స్వస్తి పలికే లక్ష్యంతో లోక్‌సత్తా పార్టీ పనిచేస్తోందని లోక్‌సత్తా మండల అధ్యక్షుడు నాగినేని రామారావు అన్నారు. మండలంలోని కొత్తపల్లిలో గ్రామ కమిటీని నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధన రాజకీయాలకు స్వస్తి పలికే విధంగా కృషి చేయాల్సిన బాధ్యత లోక్‌సత్తా పార్టీ కార్యకర్తలపై ఉందన్నారు. గ్రామాధ్యక్షుడిగా గడ్డం తానీషా, ఉపాధ్యక్షుడిగా గుండెకారి కుమారస్వామి, కార్యదర్శిగా దొమ్మటి నాగరాజు, కోశాధికారిగా రామోజు శ్రీధర్, సంయుక్త కార్యదర్శిగా తండా శ్రీనివాస్, నాగులగాని తిరుపతి, సమన్వయ కర్తగా నాగులగాని రాజు, పార్టీ బాధ్యులుగా దొమ్మటి కుమార్, రామోజు శ్రీనివాస్ ఆకుల శ్రీనివాస్, గాడిపెల్లి రాజు ఎన్నికైనట్లు తెలిపారు.

## రంగారెడ్డి జిల్లా ... మేడ్చల్

**అవినీతిపై యువసత్తా రాజీలేని పోరాటం : పి. శివాజీరాజు**

అవినీతిపై రాజీలేని పోరాటంచేయడంతోపాటు యువత సమస్యలపై నిరంతరం పోరాడుతున్న పార్టీ లోక్‌సత్తా అని లోక్‌సత్తా అనుబంధ సంస్థ అయిన యువసత్తా రాష్ట్ర అధ్యక్షులు పి. శివాజీరాజు పేర్కొన్నారు. మేడ్చల్‌కు చెందిన పలువురు విద్యార్థులు యువసత్తాలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఉపాధికల్పనను పాలకులు విస్మరించారని ఆరోపించారు. ఏటా లక్ష చొప్పున ఉద్యోగాలు కల్పిస్తామని చేసిన హామీని బుట్టదాఖలు చేశారని విమర్శించారు. ఒక రాజీవ్ యువకిరణాల పేరిట యువతను మభ్యపెట్టేందుకు కొత్త ఎత్తులు వేస్తున్నారని శివాజీరాజు ధ్వజమెత్తారు. క్యాంపస్‌లో జరిగే ఎంపికలను, ప్రైవేట్ ఉద్యోగాలను సైతం యువకిరణాల కోటాలో చేర్చడం సిగ్గుచేటని చెప్పారు. మేడ్చల్‌లో డిగ్రీ కళాశాలను ఏర్పాటుచేసి పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందుబాటులోకి తేవాలని ఆయన డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో యువసత్తా నియోజకవర్గ అధ్యక్షులు వినోద్‌రెడ్డి, ఉపాధ్యక్షులు కరుణాకర్‌రెడ్డి, లోక్‌సత్తా నాయకులు శివకుమార్, విద్యార్థిసత్తా నాయకులు అజీజ్‌సింగ్, యానిస్, శ్రావంత్, శరత్, నాగరాజు, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ జిల్లా... సిద్ధిపేట

**మద్యం షాపులను ప్రభుత్వమే నిర్వహించాలి**

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మద్యవిధానం కొత్త సీసాలో పాత సారాలాగా ఉందని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యదర్శి బండారు రామ్మోహన్‌రావు విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో లోక్‌సత్తా టైమ్స్ మాసపత్రికను ఆవిష్కరించి మాట్లాడారు. కొత్త మద్యం విధానం ప్రకటిస్తామని ఆరునెలలుగా అధికారులను అధ్యయనం పేరుతో వివిధ రాష్ట్రాలకు పంపిన ప్రభుత్వం టీడీపీ హయాంలో అనుసరించిన విధానాన్నే మళ్లీ పాటించడం సిగ్గుచేటని మండిపడ్డారు. లాటరీ విధానంతో పేదలకు లాభం జరుగకపోగా వారి ఆర్థిక పరిస్థితి కుప్పకూలే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. లాటరీ విధానాన్ని రద్దు చేసి తమిళనాడు, ఢిల్లీ రాష్ట్రాల మాదిరిగా ప్రభుత్వమే మద్యం షాపులను నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రస్తుతం కొనసాగుతున్న మద్యం షాపులను సగానికి తగ్గించి బెల్టుషాపులను పూర్తిగా తొలగించాలని డిమాండ్ చేస్తూ లాటరీ నిర్వహించే కేంద్రాల ఎదుట నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ మద్యం విక్రయాల ద్వారా ఆదాయ వనరుగా చూస్తున్న రాష్ట్రప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ చేపట్టబోయే నిరసన కార్యక్రమాలకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మహిళసత్తా జిల్లా అధ్యక్షురాలు శంకరమ్మ, సిద్ధిపేట నియోజకవర్గ సలహాదారు ప్రకాష్‌రావు, రాంచంద్రారెడ్డి, సుధీర్‌పిళ్లే, ఓంప్రకాష్, నర్సింహారెడ్డి, రాజు, యాదగిరి పాల్గొన్నారు. ◆



అంతర్వీక్షణం పుస్తకావిష్కరణ సందర్భంగా....



కెపిహెచ్‌బి టు హైటెక్ సిటీ ఫ్లైఓవర్ పనుల ఆగిపోవడంతో
అధికారులతో మాట్లాడుతున్న జేపీ



కూకట్‌పల్లి వివేకానంద డిగ్రీ కళాశాల ప్రాంగణంలో యూత్ ఫర్ సేవా, వైదిక ల ఆధ్వర్యంలో
యువతకే స్కూల్ కిట్స్ ప్యాకింగ్‌లో నైపుణ్యాలను అందించారు



మోతీనగర్ స్థానికులతో డా॥ జేపీ



మేడ్చల్‌కు చెందిన పలువురు యువకులు రాష్ట్ర అధ్యక్షులు
పి. శివాజీ రాజు ఆధ్వర్యంలో యువసత్తా చేరిక




రాయదుర్గంలో ప్రభుత్వమే మద్యం దుకాణాలను నిర్వహించాలని
కొత్త మద్యం విధానానికి వ్యతిరేకంగా ర్యాలీ



నల్గొండలో విద్యార్థులకు పలకలు, నోటు పుస్తకాలు
పంపిణీ చేస్తున్న లోక్‌సత్తా నాయకులు



చిలకలూరిపేటలో కొత్త మద్యం విధానానికి వ్యతిరేకంగా ర్యాలీ

RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2010-12




## లాటరీ, లైసెన్స్ మద్యం విధానంపై
## లోక్‌సత్తా, వామపక్షాల రౌండ్‌టేబుల్ సమావేశం

To,

**Book-Post**
PRINTED MATTER

If not delivered please return to:

**Lok Satta Times**
8-2-674B/2/9, Plot No. 93
Happy valley, Road No. 13A
Banjara Hills, Hyderabad - 500 034

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad